

# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

నవంబర్ 2013

సంపుటి : 19 227 సంచిక : 11




## దేశంలో చీకటి పునరావృతమవుతుందా? సత్తాగల నాయకత్వం లభిస్తుందా?

### - దివ్య దీపావళీ కాంతులు క్రాంతికరంగా దీప్తినొందునా?-

దేహానికి నవరంధ్రాలు ఉన్ననూ ఏకదేహమైనట్టు దేశశక్తికి నవచీలకలేర్పడిననూ ఏకశక్తిగా నిలబడగలిగితేనే అభివృద్ధి అభ్యున్నతీ!

**ఏమోఏమో రామో**– అంటూ రామరాజ్య రూపకర్త శ్రీరామచంద్రుణ్ణి తలుచుకుంటూ పాత పాతక రోజుల పునరావృతం కానీయవద్దని ప్రార్థిస్తున్నాను. దేశానికి చీకటిరోజులు పోవాలంటే రాముడేదిక్కు!

**ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్!**
**లోకాభిరామం శ్రీరామం భూయోభూయో నమామ్యహమ్!**

1948 వ సంవత్సరం తలచుకుంటుంటే గుండె గుభేల్మంటుంది. వేడిపెనంమీద పడిన మిడతలా దేశభవిష్యత్తు మసిబారిపోయేట్టుంది. అప్పట్లో దేశం మనుగడ సాగిస్తుందా అన్నది ప్రశ్నార్థకమైంది. ఏకజాతీ, ఏకభాష, ఏకమతంగల దేశం గాక పోవడం, భిన్నమతాలు, భిన్న సంస్కృతులు కలవారుండడం, దేశనాయకత్వం హిందీనే మాట్లాడాలి! హిందువులుగానే ఉండాలనుకోకపోవడం! తమను వందల సంవత్సరాలుగా బానిసలుగా అణచివేసిన అన్యభాషీయులూ, అన్యదేశీయులైనవారిపై కక్షను గానీ, కార్పణ్యంగానీ, శత్రుత్వంగానీ పెట్టుకోకపోవడం బలహీనతకు కారణమవుతుందేమో అనుకోవడం జరిగింది! మనదేశ సార్వభౌమత్వం నుంచీ తొలగిన బ్రిటిషువారు ఒకే ఆంగ్లభాషను మాట్లాడాలనే నిబద్ధత కలిగినవారై ఉన్నా, వారిలో అధికులు ప్రొటెస్టెంట్లు, వాళ్ళకి ప్రక్కనున్న ఫ్రాన్సు అంటే పడదు. పోలెండు అంటే పడదు. వారందరూ కాథలిక్కులు. రష్యా అంటే కూడా వారికి పడదు. పాకీస్థాన్ జాతీయవాదం ఐరోపాదే! వారికీ ఇస్లాము ఒక్కటేమతం. ఉర్దూ ఒక్కటే జాతీయ భాష. పెక్కుమంది పాకిస్థానీయులకు భారత్ అంటే పడదు. అయితే సునీల్ ఖిల్మానీ, ఆసియా ఖండంలో అంతులేని మతస్వేచ్ఛకు భారత్ బలమైన దుర్గం. ఇప్పటికినీ పేదరికం వర్గవిబేధాలతో సతమతమవుతున్న ఆఫ్రికన్ దేశాలు భారత్‌ను స్ఫూర్తిగా తీసుకున్నాయ్. ఒకేజాతి ఒకేభాషగా ఉండే చైనా, జపాన్‌లు భారత్‌ను బలహీనదేశమనీ, ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించలేదనుకున్న ఆనాటి భావాన్ని మార్చుకున్నాయ్.

వారి అపోహ ప్రవాహగమనానికి ఎదురునిలిచి, భిన్న సంస్కృతులు గల భారతదేశం శక్తిమంతదేశంగా ప్రపంచ దేశాల్లో మన్నన పెంచుకున్నదంటే ఆనాటి త్యాగధనులైన నాయకులు కారణం, సామర్థత కారణం, సత్యసంధత కారణం. భారత్‌లో ఉన్న ఐదారు వందల సంస్థానములు వారు భారతయూనియన్‌లో కలియడానికి విముఖత చూపారు. వల్లభాయ్ పటేల్ వాళ్ల తలలుదించేట్టు చేసి భారతయూనియన్‌లో విలీనం కావించాడు. సర్వస్వతంత్ర సార్వభౌమత్వం గల దేశంగా రూపొందించారు.

ఒక్క నిజాము మాత్రం తాను బ్రిటన్ ప్రధానమంత్రి చర్చిల్‌తో కలిసి కలిమితో స్వతంత్ర రాజ్యంగా ఉంటానన్నాడు. ఆచితూచి అడుగువేయడం, ఆలస్యం అమృతం విషం అన్న సిద్ధాంత విశ్వాసి, దేశభక్తుడైన వల్లబాయ్ పటేల్ మహనీయుడు నెహ్రూకు తెలియకుండా రాత్రికి రాత్రి భారతసైన్యాన్ని పంపి, నిజాము నవాబును లొంగదీసుకున్న ఘనత ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్‌దే! దేశమధ్యంలో క్యాన్సర్ వ్యాధిగా ఉన్న నిజాము కలుస్తాడని నెహ్రూకు నమ్మకం లేదు.

దేశభక్తి పరుడు, ధైర్యశాలియైన వల్లభాయ్ పటేల్ నిజాము పాలనలోనలిగిపోతున్న హిందువులు, తెలుగువాళ్ళ విముక్తి కోసం నైజాము కోరలను పీకి, రెక్కలు విరిచేసాడు. నిజానికీ భారతదేశం పౌరులు తరతరాలుగా వల్లభాయ్ పటేల్‌కు ఋణపడి ఉండాలి. గాంధీ నెహ్రూలకంత ధైర్యం లేదు. ధైర్యం కల సుభాష్‌చంద్రబోస్ కాంగ్రెసును విడిచి పెట్టాడు. వీరకేసరి టంగుటూరి ప్రకాశం వంటి మహాధైర్యశాలిని కేంద్రం లోకి రానీయకుండా గాంధీగారు వియ్యంకుడైన చక్రవర్తుల రాజగోపాలచారిని కేంద్ర పదవుల్లో అవకాశం కలిగేట్టు చేసి మొట్టమొదటి గవర్నరు జనరల్ చేయించారు. మద్రాసు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిని చేసి తెలుగువారికి తీరని అన్యాయానికి శంఖుస్థాపన చేసినవాడు రాజగోపాలాచారి. తెలుగువారితో స్నేహం చేస్తూనే, ఆ నాయకుల మధ్య కలతలు సృష్టించి తత్ఫలితంగా ఒక వర్గమును ప్రకాశం పంతులకు ఎదురుగా పనిచేయటకు విత్తులు నాటినందువల్లనే ఆయన మద్రాసు ఉమ్మడి రాష్ట్ర ప్రీమియర్‌గా గానీ, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగాగాని సంవత్సరకాలం కూడా పనిచేయలేదు. అలా పాలించిన కొద్ది నెలల్లోనే కృష్ణపై ప్రకాశం బ్యారేజీ, కోఆపరేటివ్ విధానం, హరిజనాభ్యుదయం, సాగుమంచినీటి పథకం వంటి నీటి పారుదల పథకాలను నెరవేర్చారు. మద్రాసుతో కూడిన ఆంధ్రరాష్ట్రానికై పోరాడినాడు. పదవికై అర్రులు చాచకుండా కాంగ్రెస్ అధిష్టానాన్ని లెఖ్ఖచేయకుండా తనకుతానుగానే నిర్ణయాలు తీసుకున్నవాడు ప్రకాశంగారే!ఆయన నిర్ణయాలలోనిదే ప్రకాశం బేరేజీ. రెడ్లను, క్షత్రియులను, కాపులను, హరిజనులను అన్ని వర్గాలవారినీ పదవులిచ్చి ప్రోత్సహించినవాడూ ఆయనే! ఆంధ్ర శౌర్యము చాటినవాడు ఆయనొక్కడే. న్యాయవాదిగా లక్షలు ఆర్జించి, అన్నిటినీ పోగొట్టుకుని, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనకు తానే తన చినుగు చొక్కాను కుట్టుకుని వేసుకున్నవాడు ఆయనే! ఇలా చెప్పుకొనిపోవడానికెన్నో ఉన్నా సంపాదకీయ ముఖ్యోద్దేశంబిది కానందున ఫుల్‌స్టాపు పెట్టేస్తున్నాను.

నెహ్రూ వ్రాసినా, అంబేద్కర్ వ్రాసినా భారత రాజ్యాంగ విధానం, పౌరులందరికీ సమ హక్కులుండాలనీ, అణగారిన తరగతులు ఎదిగేవరకూ ఉపాదులు కూర్చాలనీ విజ్ఞతను కూర్చే విద్యాప్రణాళిక ఉండాలనీ, ఏ వర్గాన్నీ తక్కువగాగానీ, మరో వర్గాన్ని ఎక్కువగాగానీ చూడని పారదర్శకత ఉండాలనీ, అంటరానితనం ప్రాంతీయ అసమానతలుండరాదనీ, దేశీయ ఉత్పత్తులనూ, వ్యవసాయ ఫలసాయములను అభివృద్ధి చేయాలనీ, కుల, మత, ప్రాంత విబేధాల కతీతంగా పాలన సాగాలనీ, గ్రామాలను అభివృద్ధిపరుస్తూ చేతివృత్తులవారికి సహకారమివ్వాలన్నదే ముఖ్య సారంశం. మిత్రదేశాలను పెంచుకొంటూ, స్వతంత్ర విధానబద్ధంగా, స్వయం సమృద్ధి సంపదకర దేశంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యోద్దేశాలన్నీ సనాతన ధర్మపరంగా తీసుకున్నవే! ఇదే లౌకికపర రాజ్యాంగం. ఏ ఒక్కరూ రాజ్యాంగ నిబద్ధతకు అతీతులు కారు. వృత్తిపరుల జీవనవిధానం కూలితే సహకార జీవనం కుంటుపడుతుంది. స్త్రీలను గౌరవించని సమాజం కారణంగా అధర్మము పెచ్చు పెరుగుతుంది. విషయేంద్రియ సంయోగము వలన ఉత్పన్నమగు భోగములన్నియూ భోగలాలసులన్జేసి అవినీతి, అతివలపై మోహము పదవుల వ్యామోహం, ప్రాంతీయాభిమానం అనర్థములకే మార్గగామియవుతుంది.

బహుళత్వం, బహుళపక్షములుగల భారతదేశంలో భారతజాతీయ విధానంలోని ఏకత్వం ఎవరినీ అనుసరించినది కాదని సి.ఎఫ్ ఆండ్రూస్ అనే క్రైస్తవప్రచారకుడైన ఆంగ్లేయుడు మహాత్మాగాంధీతో చెప్పాడు. భారత స్వాతంత్ర సమరంలో అన్ని జాతులు, అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలవారు, అన్ని భాషలవారు, స్త్రీపురుషులూ 'వందేమాతరం' అంటూ ప్రాణములు తెగించిపోరాడి, విజయం సాధించారన్న సత్యమొకటి చాలు. స్వతంత్రం సాధించిన తరువాత భారత ఆర్థికవ్యవస్థ అద్భుత విజయం సాధించింది. సర్వశక్తివంతమైన ప్రజాస్వామ్య దేశంగా పేరుపొందింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారతదేశానికి శాశ్వత సభ్యత్వం యివ్వాలని అన్యదేశాలు పోరాడాయ్.

మహాశక్తివంతమైన ప్రజాస్వామ్య దేశంగా ఎదిగిన భారతదేశం భాషా రాష్ట్రాలుగా విభజింపబడడం ఒకపొరపాటైతే, ఒకే భాషా రాష్ట్రం మూడు రాష్ట్రాలుగా విడిపోవాలనే నాయకుల బలహీనత మరో పొరపాటు. ప్రజల దౌర్భాగ్యమేమో! మరల ఈ దేశాన్ని ఏకం చేసే సత్తాగలిగి సమైక్య భారతదేశంగా రూపుదిద్దగల సత్తా ఎవరికైనా ఉందా! భారత ధరిత్రీ! నీవే చెప్పమ్మా!



బుధజన విధేయుడు
**- గోటేటి శ్రీరామారావు**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# చిలుకలకు కూడా చిలుకపలుకులు వంటి తెలుగు పలుకులు విదితమే!

## -గాకున్నచో గుణాఢ్యుడి బృహత్కథ వెలుగు చూసేది కాదు-

తెలుగు భాష గొప్పతనాన్ని మాధుర్యాన్ని తెలుగు వాడే ఎరుగడు. ఎరిగినవాడైతే, తెలుగువాడొకడిని ఒకడు తన్నుకుంటూ ఉంటారా? 'తెలుగుతల్లి'ని అగౌరవపరుస్తారా; ఎంతోకాలంగా తెలుగు ఉన్నది, ఎంతో ప్రాచుర్యం పొందింది! ప్రపంచానికి ఎంతో సాహిత్యం అందించింది. పలుదేశాల్లో ఉన్న సాహితీ కథాసారమంతా తెలుగువాడి నోటినుంచీ వెళ్లినదే!

వ్యాసవాల్మీకిలిరువురూ మహాభారత రామాయణ మహాగ్రంథముల ద్వారా విశ్వానికెంతటి నీతి, ధర్మశీల సంపదను పెంచే సాహిత్యం అందించారో- అలాగే గుణాఢ్యుడను తెలుగు భాషాపండితుడు బహుభాషల్లో ప్రావీణ్యుడై అంతటి కథాసాహిత్యం అందించాడు. ఆయన రచించిన 'బృహత్కథ'యనే కథాసాగరం 'హాలుడు' యనే శాతవాహన చక్రవర్తి కారణంగా విశ్వసాహిత్యంలో ప్రవేశించి, వివిధ దేశాల్లో తమదైన సాంస్కృతీ సారపు పూతను పులుముకుని రసజ్ఞులైన రచయితల దోసెళ్ళలో రాశురాశులుగా పోసారు. కాశ్మీరంలో సోమదేవభట్టు 'కథాసరిత్సాగరం' అని వ్రాసాడు. నేపాల్ దేశీయుడైన బుద్ధస్వామి 'బృహత్కథా శ్లోకసంగ్రహం' అని రచించాడు. ఇతఃపూర్వమే గుణాఢ్యుని మూల గ్రంథసారం 'అరేబియన్ నైట్సు'గాను, పంచతంత్రం, హితోపదేశం, భేతాళపంచ వింశతి కథాగ్రంథాలుగా, మనదేశంలోనూ, మనదేశం దాటి ఇతర దేశాల్లోనూ గ్రంథావతారములెత్తి, యావత్ప్రపంచ కథలకు మూలసారమైంది. కొందరు సాంఘిక ఇతివృత్తంగాను, మరికొందరు జానపద ఇతివృత్తాలుగాను, మఱ్ఱిఊడల్లా విస్తరింప చేసారు. క్రీస్తుశకానికి ముందే తెలుగు రాజ్యాలున్నాయ్. తెలుగు ప్రభువులు కాలంలో సాహిత్యాన్నీ, కళల్నూ వారెంతో ప్రాణపదంగా భావించి పోషించారు. ఓ ప్రక్క ప్రాకృతం, మరోప్రక్క సంస్కృతమూ పోటాపోటీపడి పండితులూ, ప్రభువులూ ప్రోత్సహించిననూ, ప్రాకృతభాషపై ఈసడింపు ప్రబలింది. మాతృభాష తెలుగుపై ఇటు ప్రభువులకు, అటు పండితులకు మమకారం యెక్కువగా ఉండే రోజులవి! ఇందుకు ముఖ్య కారణం ప్రభువులే కవులై ఉండడమని గ్రహించాలి.

### ఇప్పటి పాలకులకూ, పాలితులకూ మాతృభాషపై మమకారం లేదనే చెప్పాలి!

అందరూ శ్రీకృష్ణదేవరాయలూ, రాజరాజ నరేంద్ర ప్రభువుల కాలమునే చెబుతారు గానీ, శాతవాహనుల కాలాన్ని పెద్దగా చెప్పరు. శాతవాహనుల పాలనం గానీ, కళా సాహిత్యాల ఆలన (ప్రోత్సాహం) గానీ- ఈనాటికినీ మన చరిత్రల్లోగానీ, విదేశీయుల మదిల్లోనూ క్షిప్తంగా ఉన్నది.

శాతవాహన చక్రవర్తుల్లో హాలుడు గొప్ప సాహిత్యవేత్త, సాహితీప్రియుడేగాని అతనికి ప్రాకృత భాష అంటే అయిష్టం. అందువలన హాలుని దృష్టి సంస్కృతంపై బడింది. ఇందుకు కారణం- హాలుడు ప్రేమించి పెళ్ళాడిన భార్య లీలావతి తరచు సంస్కృతంలో మాట్లాడేది. హాలుడు దానికి బదులు చెప్పలేక సంస్కృతం రాదనక, ఏదో బదులు సౌంజ్ఞలుగాను, విరుద్ధంగాను చెప్పేవాడు. ఆవిడ ఫకాలను నవ్వేది. హాలుడుపైకి గంభీరంగా ఉన్ననూ లోలోన చింతించేవాడు. ఎలాగైనా సంస్కృతం నేర్చుకోవాలని నిర్ణయించి తన ఆస్థానంలో ఉన్న పండితులలో ఒకరు గుణాఢ్యుడు, (ఈయనే మన కథానాయకుడు) మరొకరు శర్వవర్మలతో తనకు సంస్కృతం నేర్పడానికి ఎంతకాలం పడుతుందని అడిగాడు. గుణాఢ్యుడు ఆరు సంవత్సరాల్లో నేర్పి మిమ్మల్ని పండితునిగా తీర్చిదిద్దుతానన్నాడు. రాజు సన్నిహితత్వం కోసం యత్నిస్తున్న శర్వవర్మ ఆరుమాసాల్లో నేర్పగలనన్నాడు. గుణాఢ్యునికి కోపం వచ్చింది. నీవు ఆరునెలల్లో ప్రభువులకు సంస్కృతం నేర్పకల్గితే నేను సంస్కృతం, ప్రాకృతం, మాతృభాషల్లో కవిత్వం వ్రాయను అని వ్రాస్తున్న ఘంటాన్ని క్రింద పడేసాడు. శర్వవర్మ పట్టుదలతో హాలునికి సంస్కృతంనేర్పి గుణాఢ్యున్ని పందెంలో ఓడించి సిగ్గుపడేలా చేసాడు. గుణాఢ్యుడు ఆ పరాభవంతో హాలుని రాజ్యం విడిచి అడవులకు వెళ్ళాడు.

అలా గుణాఢ్యుడు ఏడు సంవత్సరాలు అడవుల్లో ఉన్నాడు. పైశాచిక భాషలో ఏడు లక్షల శ్లోకాలతో 'బృహత్కథ'ను వ్రాసి తన శిష్యులచే ఆ గ్రంథాన్ని హాలుడికి పంపించాడు. జన ప్రాచుర్యంలోకి తెమ్మని సందేశం పంపాడు. అప్పటికే హాలుడు సంస్కృతంలో గ్రంథం పూర్తిచేసాడు. గుణాడ్యుడు పంపించిన గ్రంథాన్ని ఈసడించుకుని, అతని శిష్యులకే యిచ్చేశాడు. శిష్యులు వెళ్ళి గుణాఢ్యునికి చెప్పారు. అన్ని సంవత్సరాలు కష్టపడి వ్రాసిన గ్రంథాన్ని రాజు ఈసడించి పంపడాన్ని అవమానంగా తలచి దుఃఖభారంతో క్రుంగిపోయాడు. నీళ్ళునిండిన కళ్ళల్లో నిప్పులు రగిలాయి. ఆ పత్రాలను అగ్నికి ఒక్కక్కటే ఆహుతి చేయసమకట్టాడు. పక్షులూ, మృగాలూ చుట్టూ చేరాయి. వాటికి ఒక్కొక్క శ్లోకాన్నీ వినిపిస్తూ, అగ్నికి ఆహుతి చేస్తున్నాడు. చుట్టూ ఉన్న పక్షులు, మృగాలు ఆక్రోశం చెందాయి. నీళ్లూ, ఆహారం ముట్టడం మానేసాయి.

ఇక్కడ హాలుని వంటశాలలో మాంసం రుచీపచీ లేకుండా పోయింది. వంట వాళ్ళను అడిగితే, గుణాఢ్యుని నిరసనకారణంగా పక్షులు తిండీ తిప్పలు మానేసాయ్. వాటి వద్ద 'బృహత్కథ' ఒక్కొక్క శ్లోకాన్నే చదువుతూ, అగ్నిలో వేసి గుణాఢ్యుడు తగులబెడుతున్నాడని చెప్పారు. వెంటనే హాలుడు గుణాఢ్యుడున్న వనానికి వెళ్ళాడు. అప్పటికే ఆరు లక్షల శ్లోకాలు తగులబడ్డాయి. హాలుడు ప్రాథేయపడి గుణాఢ్యుని ఆగ్రహాన్ని శాంతింప చేసాడు. ఏడో లక్ష శ్లోకాలనైనా తనకివ్వమని కోరాడు. ఆ లక్ష శ్లోకాల పరిమిత మయిన బృహత్కథలో నరవాహనదత్తుడు ప్రధాన కథానాయకుడు. అతడీ చరిత్రలో ఏ విధంగా చక్రవర్తియైనదీ చేసిన సాహసకృత్యాలు, సుందరాంగులతో ప్రేమ కలాపాలు, పెళ్ళిళ్లూ, సాహసయాత్రలు ప్రధానమైనవి. వాటిల్లో కొన్ని ఉపాఖ్యానాలు, ఉపకథలూ హృద్యంగా ఉన్నాయ్. వీటన్నిటినీ ఓ బృహత్కథగా గుణాఢ్యుడు వర్ణించిన తీరు హాలుణ్ణి హత్తుకున్నది.

రెండువేల ఏళ్ళనాటి ఆ బృహత్కథలోని గాథలు ప్రపంచం యావత్తూ ప్రసారమై, అరేబియన్ నైట్స్ కథలుగా, పంచతంత్రం, హితోపదేశం, భేతాళపంచవింశతి కథలుగా రూపాంతరం చెందినవి. ఈ సందర్భంగా తెలుసుకోవాల్సిన ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే గుణాఢ్యుడు తెలుగువాడు. హాలచక్రవర్తి ఆస్థానాన్ని వదలి అడవికి వెళ్ళి బృహత్కథను రాసిన ప్రదేశం ఇప్పటి మెదక్ జిల్లాలో హైదరాబాదుకు దగ్గరలో ఉన్న కొండాపూర్ అనీ, అనుసృతంగా వస్తున్న ఈ ఐతిహాస్యాన్ని తెలుగువారందరూ తెలుసుకు తీరాలి.

పైశాచీభాష అంతరించిపోయినా ఆ భాషలోని మూల బృహత్కథ లభ్యం కాకపోయినా ఏడవ ఆశ్వాసం అయిన నరవాహన దత్తుడి చరిత్ర మనకు సంస్కృత అనువాదాల వల్లనే తెలుస్తోంది. ఇవి రెండు రకాలు. కాశ్మీర దేశీయుడు సోమదేవభట్టు రచించిన 'కథాసరిత్సాగరం', రెండవది నేపాలదేశీయుడు బుద్ధస్వామి రచించిన 'బృహత్ కథాశ్లోకసంగ్రహం'. రెండింటిలో ఎక్కువ ప్రాచుర్యం పొందింది 'కథాసరిత్సాగరం'. ఇరవైరెండు వేల శ్లోకాలున్న ఈ గ్రంథమే ఇవాళ మనందరికీ తెలిసిన గుణాఢ్యుడి బృహత్కథను ప్రాచుర్యంలోకి తెచ్చింది. ప్రపంచ సాహిత్యంలో విశిష్టమైనదిగా బృహత్కథను నిలబెట్టింది. ●





## జానపద చిత్రాల నిర్మాణానికి ఆద్యుడు!

# కాళ్లకూరి సదాశివరావు

తెలుగు చలనచిత్ర నిర్మాణచరిత్ర నెరుంగనివారు మద్రాసులోని చలనచిత్ర నిర్మాణశాలలు (స్టూడియోలు) మూతబడడానికీ, 'ఆంధ్రాహాలీవుడ్' అని జాలీగా పిలుచుకునే కోడంబాకంలోని స్టూడియోలు మూతబడడానికి కారకులైనవారికి భారత చలనచిత్రచరిత్రగానీ, మద్రాసు చిత్రనిర్మాణ చరిత్రగానీ, కృషీవలులైన పత్రికా రచయితలనుగానీ ఎరుగనివారు చలనచిత్ర శతవసంతోత్సవాన్ని జరిపారనేది బాధాకరమైన విషయం. దీనిని మేము విమర్శించకపోయిననూ విశ్వసించడం లేదు.

జానపదచిత్రాల బ్రహ్మగా అందరూ విఠలాచార్యను చెప్పుకుంటారు. అదివాస్తమైనప్పటకినీ, 1939వ సం॥ములో విడుదలైన 'గులేబకావళి' ఆ చిత్ర నిర్మాణసారథి, దర్శకుడైన కాళ్ళకూరి సదాశివరావు తొలి తెలుగు జానపదచిత్ర నిర్మాత– దర్శకుడనీ 'జానపదచిత్రబ్రహ్మ'గా గణుతికెక్కినాడని ఎంతమందికి తెలుసు?

తెలుగు చలనచిత్ర నిర్మాణం ప్రారంభమైన ఏడెనిమిదేళ్ళవరకూ పౌరాణిక చిత్రాలే నిర్మింపబడ్డాయ్. అవికూడా పేరొందిన పౌరాణిక నాటకాలనే యదాతథంగా నిర్మించడం జరిగింది. ఆ కాలంలో నేపద్యగానం చేసేవారు లేరు. పౌరాణిక నాటక నటులే తమ పద్యాలు పాటలను తామే నాటకఫక్కీలో పాడుతూండేవారు. సురభికమల, రామతిలకం, శ్రీరంజని సీనియర్, కన్నాంబ, దాసరికోటిరత్నం, ఎస్.పి. లక్ష్మణస్వామి, వేమూరిగగ్గయ్య, రామనాథశాస్త్రి, సూరిబాబు, సీయస్సార్, రఘురామయ్య ప్రభృతులు సినిమారంగ నటులుగా వచ్చినవారు నాటకరంగ పెద్దలే.

కాళ్లకూరి సదాశివరావు చిత్రరంగంలో ప్రవేశించడానికి ప్రధాన కారణం– వారి తండ్రి కాళ్ళకూరి నారాయణరావుగారు. ఆయన ప్రముఖ నాటక రచయిత. దాదాపు వారి నాటకాలన్నీ తరువాత సినిమాలుగా వచ్చాయ్. చింతామణి, వరవిక్రయం, మధుసేవ వంటి నాటకాలను వ్రాసి, వందల ప్రదర్శనలు జరిగి జనంలో చైతన్యం తీసుకుని వచ్చాయ్.

నాన్నగారి అభిరుచిని వంటబట్టించుకోవడంవల్లనే కళారంగంపై సదాశివరావు దృష్టిపడింది. నటీనటుల కాణాచియైన కాకినాడలో 1901వ సం॥ము ఫిబ్రవరి 13న పుట్టడం, కాకినాడలోనే పి.ఆర్. కాలేజీ చదువువరకు ఉండడం, తెలుగు నాటకరంగ వాయువులు పీల్చడంతో, కళపట్ల ఆసక్తి కల్గింది. వారి అన్నగారు కాళ్ళకూరి దక్షిణామూర్తిగారు డిస్ట్రిక్టు బోర్డు ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా ఉండేవారు. వారిది విద్యావంతుల కుటుంబం. హైదరాబాద్, మద్రాసుల్లో బాంకింగు కోర్సు చదివారు. అప్పటివారి దృష్టి ఎక్కువగా రంగూన్ ఉద్యోగాలపై ఉండేది. పత్రికల్లో ప్రకటన చూసి రంగూన్ మెజిస్టిక్ థియేటర్‌లో అసిస్టెంట్ మేనేజర్ పదవికి అభ్యర్థులు కావాలని ప్రకటనతో దరఖాస్తు పెట్టారు. రాదనుకున్న ఆ ఉద్యోగం వచ్చింది. 1923 సం॥ములో రంగూన్ వెళ్ళి కొద్దినెలలపాటే ఆ ఉద్యోగం చేసారు. అక్కడి వాతావారణం ఆయనకు పడలేదు. కాకినాడ వచ్చి సిటీ ఎలక్ట్రిక్ థియేటర్ పేరుతో ఒక థియేటర్‌ను, టూరింగ్ టాకీసును నడిపారు. ముందుగా సి. పుల్లయ్యను పరిచయం చేసుకున్నారు. ఆ చిత్ర ప్రదర్శన వ్యాపారం కలిసిరావడంతో 'ఇంపీరియల్ ఫిలిం సర్క్యూట్ చలనచిత్ర పంపిణీ సంస్థను ప్రారంభించారు. అటు తరువాత భాగస్వాములతో భేదం రావడంతో కాక్సన్ ఫిలిమ్ ఎక్స్ఛేంజి పంపిణీ సంస్థను ప్రారంభించారు. సినిమాల్లో ఆదాయం, అభిమానం దినదినాభివృద్ధి చెందడంతో– చిత్ర నిర్మాణం ప్రారంభించి, అప్పుడొస్తున్న పౌరాణిక సినిమాలకు భిన్నంగా కొత్త పద్ధతుల్లో కత్తులూ, యుద్ధాలూ, మంత్రాలు, తంత్రాలూ, మాయలూ, పాటలతో చిత్రం నిర్మించాలనే అభిప్రాయంతో 'గులేబకావళి' కథను ఎన్నుకుని, చిత్రనిర్మాణం పూర్తిచేసి 1939 సం॥ములో ఆంధ్రదేశంలో విడుదల చేసారు. ఈ మార్పులతో నవీనంగా ఉన్న 'గులేబకావళి' చిత్రం జనాన్ని సమ్మోహితుల్ని చేయడమేగాకుండా– జానపదచిత్రాల నిర్మాణమునకు మలుపు తిప్పింది. సదాశివరావు ఆనందానికి అవధులే లేవు. అలా ఆయన జానపద చిత్రాల నిర్మాణానికి ఆద్యుడయ్యారు.

ఎన్టీరామారావుగారు స్వంత నిర్మాణ సంస్థను ప్రారంభించిన తరువాత జానపద చిత్రాలను నిర్మిస్తూ, 'గులేబకావళి' చిత్రాన్ని తిరిగి నిర్మించారు. ఇహ వాహినీవారి 'గుణసుందరి కథ' విజయవారు 'పాతాళభైరవి' చిత్రాల విజయాన్ని జూచి విఠలాచార్య శకం ప్రారంభమైంది. ఆయన్నుతమిళులుకూడాఅభిమానించి, పూజరోజునే డబ్బింగు హక్కులు తీసుకోవడం ప్రారంభించారు. ఆయన్ను 'జానపదబ్రహ్మ'ను చేసారు. ●




## తెలుగు గడ్డలో గాండ్రించు పులిబిడ్డలే రాష్ట్ర పురోగమన కారకులవ్వాలి!

పల్లవి : ఇది తెలుగు గడ్డ గాం<br>
డ్రించు పులిబిడ్డ- ఈ<br>
గొంతులో పిల్లికూతొద్దురా- ఈ<br>
గుండెలో గొర్రెదాటొద్దురా॥

చరణం 1 : ఇది తెలుగు పలుకు : కురి<br>
సే తేనె చినుకు - ఈ<br>
పలుకెపుడు నీరు గారొద్దురా - తీపి<br>
చిలికితేనే చెవికి ముద్దురా ॥

చరణం 2 : ఇది తెలుగు తెలివి : రగి<br>
లే నిప్పకొలిమి - ఇది<br>
ఎప్పడూ మండుతుండాలిరా - బూది<br>
కప్పినా ఉరుముతుండాలిరా ॥

చరణం 3 : ఇది తెలుగు కీర్తి కది<br>
లే కిరణమూర్తి - ఇది<br>
సాగరాల్ దాటిపోయిందిరా - న<br>
యాగరాల్ మీటి వచ్చిందిరా ॥

చరణం 4 : ఇది తెలుగునాడి : ఆ<br>
డే కూచిపూడి : ఇది<br>
పేరిణిగ పదము తొక్కాలిరా : నవ<br>
ప్రేరణకు లయలు కొట్టాలిరా ॥

చరణం 5 : ఇది తెలుగు గీతి : త్యా<br>
గయ్య గళజ్యోతి - ఇది<br>
మరిమరీ ప్రజ్వలించాలిరా - బాల<br>
మురళులై ప్రస్తరించాలిరా ॥

చరణం 6 : ఇది తెలుగు ప్రతిన ఒక<br>
టే దీని తపన - ఈ<br>
రాష్ట్రం పురోగమించాలిరా - ప్రజల<br>
రాజ్యం త్రివిక్రమించాలిరా ॥

– డా॥ సి. నారాయణరెడ్డి

# పుట్టా మంగపతి- పుట్టున స్వరసేవ! సర్వార్థ సంగీత రసజ్ఞుల కండిక!




**నా** వృత్తి జీవితంలో అత్యంత ముఖ్యమైనప్రాజెక్ట్ ఘంటసాల భగవద్గీత. ద్వాపర యుగంలో శ్రీకృష్ణపరమాత్మ, గీతను బోధించాడు. ఈ యుగంలో తెలుగు ప్రజలకు దాన్ని మరలా వినిపించి భగవద్గీత మరింత ప్రాచుర్యం పొందటానికి కారణభూతుడయ్యాడు ఘంటసాల. ఆయన జన్మ పవిత్రమైనది. అంతటి మహత్తరమైన ఘంటసాల భగవద్గీత రికార్డింగ్‌లో పాలుపంచుకోవడానికి వేంకటేశ్వరుడు నన్ను సారథిగా నియమించి అనుగ్రహించినందుకు నా జన్మ కూడా తరించిందనే సంతోషంగా ఉంటున్నాను. నేను తొలుత ఆశించినట్టు సినిమాప్రపంచంలో స్థిరపడి ఒకవేళ వేయి సినిమాలకు దర్శకత్వం వహించినా, నిర్మించినా అది ఘంటసాల చేత గానంచేయించిన భగవద్గీతకు సరితూగవని నిర్మొహమాటంగా చెప్పగలను.

**మా**మిడి పళ్ళకాలంలో బంగినపల్లి, సువర్ణరేఖ, మామిడిపండ్లకు తీపి తీపులున్నప్పటికినీ, చెరుకు రసాలూ, పెద్దరసలూ, చిన్నరసాల పండ్ల అమృత తీపి వేఱు! అందుకే వాటిని రసం అన్నారు. ఏ రసం ప్రత్యేకత ఆ రసానిదే! కానీ మూడు రసాలను ఒకేసారి జుర్రలేం. అధరం ఆస్వాదించలేదు. అన్ని రస ఝురులనూ సంగమించి జుర్రుకోగలిగేది సంగీతఝురి మాత్రమే! అలా జుర్రుకుంటూ, జుర్రింప చేసినవాడొక మంగపతి ఒకడే అన్నపుడు మరొకడు లేడనునది దృఢమైన సత్యం. అందుకే ఆయన్ను మేంగోపతి- అనేవాణ్ణి. స్వరఝురి స్వరజడి స్వరబడి, స్వర ఒరవడిల ముద్రితాల్లో దేశికుడై, నిర్దేశికుడై, స్వరబద్ధతకు నిబద్ధకుడైనాడు కాబట్టే 'స్వరసేవ' అనే గ్రంథ ప్రతిని ఆవిష్కరణకు ముందుగా నాకు తెచ్చి యిచ్చారు ఆ 'స్వరసేవ' రసాస్వాదన చేసాను.

హెచ్.ఎం.వి.- అనే మూడు సంకేతాక్షరాలూ 'హిజ్ మాస్టర్స్ వాయిస్"కు ప్రతీకలు. ఆ హిజ్ మాస్టర్ ఎవరు అనేసరికి నారదుడూ ఆయన మోస్ట్‌రెస్పెక్టెడ్ మాష్టర్ మురళీధరుడైన గోవిందుడని చెప్పుకోవాలి. వీళ్ళను మించిన గళధారులు లేరనే చెప్పాలి. గరళధరులను సహితమూ రంజింపచేసిన స్వరమాధురి సంగీతం. అందుకే స్వరామృతం ధరనే అధరమును పండింపచేసి మధురం అతిమధురమైంది. పుట్టామంగపతినో సంగీత స్వరపుట్ట చేసింది.

'రాగం' రోగ నివారణౌషధం యని సంగీతజ్ఞులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ నుంచీ దత్తావధూత శ్రీగణపతి సచ్చిదానంద సరస్వతీ వరకు చెబుతున్నారు. తమిళంలోనైతే పెద్దపెద్ద సాధుమహారాజులు సంగీత సౌరభిమైన సామవేదాన్నే ఔపోసన పట్టారు. వారు రాగాలపట్టులోనే భగవంతుని అనుగ్రహం పొందారు. కబీరులు, తాన్‌సేన్‌లవోలె బాలగంధర్వుల వంటి సంగీతస్వరమేటులెందరో మనవారిలో ఉన్నారు. త్యాగరాజు, శ్యామశాస్త్రి, దీక్షితుల త్రయం తరువాత వచ్చిన వారిలో గంధర్వగాన ఘంటసాల వేంకటేశ్వరరావు మన తెలుగు వారికి ఒక స్వరవరం. ఆయన లలితసంగీతం, సినిమా సంగీతమునకే ఔన్నత్యము చేకూర్చినవాడందురుగానీ, ఏ స్వరసురమైనా నాదబ్రహ్మ నారదుని మహతిలా, కృష్ణదేవుని పిల్లనగ్రోవిలా పలికించ గలడని, విశ్వసించినవాడు 'సంగీతపెట్టు' పుట్టామంగపతి! తాను పని చేస్తున్న H.M.V.సంస్థ ద్వారా భగవత్సారమైన 'భగవద్గీత' శ్లోకములను ఘంటసాల వేంకటేశ్వర రావుగారిచే ఆలపింపచేసి, వ్యాఖ్యను సహితము ఆయనచే పలికింపచేసి ధ్వనిముద్రితం కావించి, గ్రామఫోను రికార్డుగా 'స్వరసేవ' సర్వార్థ సామవేద సేవగా పరిమళింపచేసినవాడు పుట్టా మంగపతి. ధ్వని ధన్యత చెందాడు. ఘంటసాల పూర్వజన్మ ఫలమేమో గానీ, శ్రీకృష్ణుడే స్వయంగా వచ్చి గీతాబోధన చేసినంతటి గీతాసార స్వరసిద్ధి కలిగింది.



మంగపతి గురించి చెప్పాలంటే ఎంతో కథ- మహాభారతం వంటి కథ. భారతంలోలేని విషయం ఎందునా ఉండదు. ఎందునా లభించని విషయం భారతంలోనే లభిస్తుందన్నట్లు పుట్టా మంగపతి విరచితమైన తాజాగ్రంథం 'స్వరసేవ' గ్రంథంలో సర్వగాన గంధర్వులు ఆనాటి నటనటీమణులు (గానసంపత్తి కలవారు) అందరూ పాత్రలై వస్తారు. అలనాటి ప్రముఖ నాటకనటులు స్టేజీపై ప్రెస్టేజీగల పాత సినిమా నటీనటులు (అందరూ గాన ప్రతిభా సామర్థ్యములు కలవారే) కనిపిస్తారు. పూర్వా పరములెరిగిన మంగపతి అలనాటి సంగీత, నాటక, సినిమా ప్రముఖులందర్నీ కళ్ళకు కట్టింపచేసిన 'స్వరసేవ' గ్రంథం స్టేజి, సినిమా సంగీత ప్రపంచాన్ని దృశ్యీకరించింది. సంగీత స్వరానికి సాహిత్యము అనుసంధించినట్లు సంఖ్యావారీగా ఆ చరిత్రను చెబుతూ, స్వరసురారాగమైన తన చరిత్రను అనుసంధింప చేసారు. ఎనిమిది పదుల వయసు తీరానున్న మంగపతి ఇప్పటికీ గొంతెత్తి ఎలమావి కోయిలలా పాడగలరు. హెచ్.ఎం.వి. స్వరముద్రణాధికారిగా పనిచేసినందున ఎందరో గాన గంధర్వులు ఆయన వద్దకు వెళ్ళడం వారి సామర్థ్యంను గ్రహించి సద్యో నిర్ణయం చేసి వారి గాన ప్రతిభను ధ్వనిముద్రితం చేసి గ్రామఫోను రికార్డులుగా పరిచయం చేయడం త్రివేణి సంగమమంత సంబరాన్ని ఆమెచ్యూర్సుకు, మెచ్చూర్సుకూ ఆయన కల్పించారు.

అక్షర చతురత, స్వరాక్షర సంగ్రహంగా సమీకరణమైన యీ 'స్వరసేవ' గ్రంథమును తన తల్లిదండ్రులైన పుట్టా వేంకట స్వామి, పుట్టా వేంకట మునియాంబలకు అంకితమివ్వడం సబబుగా ఉన్నది. శ్రేయోమూర్తులు, అజాత శత్రులైన మంగపతి ఆయురారోగ్య ఐశ్వర్యములతో వర్ధిల్లాలని ఇలాటి విశేష విశ్లేషణ గల గ్రంథాలనెన్నిటినో వ్రాయాలని ఏడుకొండలతేడును ప్రార్థిస్తున్నాను. ●


**ఒడలు తెలియక ప్రక్కపై పరుండి అనంతమైన స్వప్న లోకాలలో హసించి, మధురాశయమేదో కలిగి, ఫలించినట్లు పులకించిపోయిన గుర్తులు ఉషఃకాలమున లేవగానే నెమరుకొస్తాయ్. రాకా శశి కౌముదీయలతికలు నిటాఉగా నున్న మొక్కను అల్లుకుని,మ్రోల మహానుభూతిని కలిగిస్తుంది. సకలము సిద్ధించి నటుల సద్యోసంకల్పము కలిగి, కర్ణయుగళ సదూషణముగ మనసున నాటుకునిపోయి ఆ పనిని తలపై పెట్టుకున్నంతగా, తలంచిన తలపున కలిగిన వ్యక్తి ఆశయాన్ని ఆచరణ పరంగా కార్యోన్ముఖుణ్ణి చేస్తూ, హిమాలయ శిఖర సమునితస్థాయికి తీసుకుని వెడ్తూ- చరిత్రలో సువర్ణాక్షరస్ఫుటీకర శక్తిమంతునిగా చేస్తూ ప్రత్యేకతను, విశిష్టతను సంతరింపచేస్తుంది. కృషితో నాస్తి నఫలం అనీ, నాస్తి దుర్భిక్షమనీ అనే దాన్ని పాలు తోడు పెట్టి, రుచ్యమైనట్టి గడ్డపెరుగు లాంటి ప్రేమాస్పదపు పలుకులు పలకడం పుట్టు సంగీత స్వర పుట్టా మంగపతికే సాధ్యం. పలుకుల్లోనే స్వర సేవ ఉన్నది. పలు రకాల స్వర ఆరాధన ఉన్నది. అణకువ ఉన్నది. ఇవే ఆయనకెన్నో సన్మానాలు కూర్చాయ్.**

*We Provide your comfortable Stay and Tasty Food*

## Bhimas Deluxe Hotel

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com**



# తెలుగు వెలుగై తెలుగునాటికి వెలుగు తెచ్చిన ప్రేమమూర్తి నడయాడిన దైవం సత్యసాయి!

**భ**గవాన్
సత్యసాయి
పుట్టపర్తిలో
చివరిశ్వాస వరకూ
ఉండి, విశ్వంలోని
సమస్త ఖండాలలోని
సమస్త దేశాల్లోనూ తాను
వెళ్ళకుండానే తన లీలలు చూపించారు.
దేశ జనుల్లో ప్రేమతత్వం పెరగడానికి
అహరహమూ కృషి చేసారు. మట్టిలోంచి మాణిక్యాలు తీసినట్టు
మధురఫలాలు, తీపి మిఠాయిలు, అమృతం వంటి రుచిగల
రసామృతాలను తీసారు.
జనులకు త్రాగునీటి వసతులను కల్పించారు. ఆసుపత్రులు కట్టించి,
లక్షల విలువైన శస్త్రచికిత్సలను ఉచితంగా చేయించారు. పుట్టపర్తిలోనూ,
వైట్‌ఫీల్డులోనూ, వైకుంఠం వంటి భవనాలు కట్టించారు.
ఆయన అడుగు కదపకుండానే ఎందరో దేశాధినేతలు వచ్చి
ఆయన్ను పుట్టపర్తిలో దర్శించారు. పాశ్చాత్య దేశాల్లోని భక్తులకు
ఎన్నెన్నో మహిమల్ను సాక్షాత్కరింప చేసిన సాయి
వాల్మీకి, వేదవ్యాసుల కన్ననూ ఎక్కువ భక్తి వాఙ్మయాన్ని ప్రపంచానికి
అందజేసి ప్రత్యక్షదైవంగా నడయాడారు.
ఆంధ్రప్రదేశంలో సత్యసాయి పుట్టడం తెలుగువారి అదృష్టం.



# బాలానందం బ్రహ్మానందం! బ్రహ్మాండానందం!

## దసరాపండుగలోని బాలల ఆనందం తుడిచేసిన ప్రభుత్వం పునరుద్ధరించాలి!

**బా**లల్లారా! బాలల్లారా
పెద్దలకు దారిజూపే ధీరుల్లారా!
భారతమాతకు ముద్దుపాపలు మీరే
భావినేతలూ మీరే మీరే మీరే!

భారతదేశం ఒకటే యిల్లు
భారతమాతకు మీరే కళ్ళు
బడిలోపలా బయటా- అంతా ఒకటై మెలగాలి
జాతిగౌరవం కాపాడాలీ!

భారతీయులై మెలగాలీ
కన్యాకుమారి నుంచి కాశ్మీరము వరకూ
అన్యోన్యతనధికంగా పెంచాలి!
వీడని బంధం వేయాలి! భారత ప్రతిష్ఠను పెంచాలీ!

**ద**సరాపండుగను అమ్మల పూజలతోనూ, అయ్యల పూజలతోనూ సరిపెట్టడంతో బాలల ఆనందం కొరవడింది. మన పూజలందుకునే అమ్మవారు (ఆదిశక్తి) అయ్యవారు ఆదినారాయణుడూ హర్షించడంలేదు. పిల్లలంటే 'అమ్మ'కెంతో ఆనందం, అనురాగం, అనసూయమ్మ త్రిమూర్తులైన బ్రహ్మవిష్ణుమహేశ్వరులనే పసిబిడ్డలుగా మార్చి తన ముచ్చటలు తీర్చుకుంది. యశోదమ్మ అవతారమూర్తినే తన బిడ్డగా ఒడిలో పెట్టుకుని బాలక్రీడలను జూచి మురిసిపోయింది. తల్లీబిడ్డల అనురాగం భూదేవీ బిడ్డల అనురాగం వంటిది. పుట్టిన తరువాత ప్రాణి బాల్యంలోనే క్రీడలతో ఆనందిస్తుంది. ఆ ఆనందం అపురూపమైనదని పెద్దలు కొందరు వారికోసమే ఏర్పాటుచేసిన పండుగలు దసరాపండుగలు. తమకు పాఠాలు చెప్పే గురువులకు, తోటిపిల్లలతో తమయింటికి తీసుకుని తమ తల్లితండ్రులు కుటుంబసభ్యుల సమక్షంలో గిలకలు పట్టుకుని పాటలు పాడుతూ పరవశించిపోతారు. ఇక్కారణంగా గురుశిష్య సంబంధం, ఇంట్లోని పెద్లకు గురువుల పరిచయం కలగడమే గాకుండా, తోటి విద్యార్థులతోటి సాంగత్యం పటిష్టమవుతుంది. పిల్లలో భక్తి, అనురక్తి పెరుగుతుంది. గడపదాటని ఆడవారు ఆ గురువుల్నీ, తమ తోటిపిల్లల్నీ చూచే అవకాశం పెంపొనరిస్తుంది. తమ పిల్లల గురువులకు తాంబూలంలో దక్షిణయిచ్చి, వసతి ఉన్నవారైతే వారికి నూతన వస్త్రములిచ్చి, పండ్లూఫలహారం యిస్తారు. వచ్చిన పిల్లలందరికీ పప్పూ ఫలహారములిస్తారు. 'బాలదీవెన బ్రహ్మదీవెన' అన్నమాట ఈ సందర్భంగానే ఏర్పడింది. గురుదీవెన, నారాయణుని దీవెన ఈ సందర్భములోనే వారికి సిద్ధిస్తుంది. పిల్లలు ఇంటికి రాగానే-

**ధరసింహాసనమై నభంబు గొడుగై తద్దేవతలు భృత్యులై!**
**అంటూ వర్థిల్లు నారాయణా**

అనే నారాయణ స్మరణతో ఆలాపన ప్రారంభిస్తారు. ఇంటిల్లిపాదీ ఆపాటకు పరవశులైపోతారు. అదిచూచి పిల్లలు యింకా పాడుకుంటూ పాటలు కొనసాగిస్తారు. పిల్లలుపాడుతూంటే వారు వింటూ కాలక్షేపం చేయడంచూస్తారు. జూచి,

**ఏదయా మీదయా మామీద లేదూ**
**ఇంతసేపుంచుటా ఇదిమీకు తగునా-** అని పాడుతూ-
**దసరాకు వస్తిమని విసవిసలుపడక**
**చేతిలో లేదనక అప్పివ్వరనక**
**ఇరగుపొరుగులవారు ఇస్తారు సుమ్మీ**

అంటూ కొరచూపులు చూస్తుండగా- ఇంటాయన గురువులకు తాంబూలం యివ్వడానికి లోపలికి వెళ్ళి వస్తుంటాడు. పిల్లలు గళమెత్తి.

**పావలా బేడయితే పట్టేదిలేదూ**
**అర్థరూపాయిస్తే అంటేది లేదూ**
**ముప్పావలా యిస్తే ముట్టేది లేదు**
**హెచ్చు రూపాయిస్తే పుచ్చుకుంటాము**
**జయాబి జయభవా దిగ్విజయభవా!**
**అయ్యవారికి చాలు ఐదు వరహాలు**
**పిల్లవాళ్ళకు చాలు పప్పుబెల్లాలు**
**శ్రీరస్తు శుభమస్తు! దిగ్విజయాభిరస్తు**

-అని వాళ్ళు పాడుతూ బాలానందం వ్యక్తపరుస్తుంటే ఇరుగుపొరుగూ వేడుకగా చూసేవారు. ఈ విధంగా ఓ వారం రోజులు పిల్లలు పూర్ణానందభరితులయ్యేవారు. వాళ్ళు రేపు మాయింటికి వెడదామంటే మా యింటికి వెడదామని గురువులను బలవంతం చేసేవారు. ఇంట్లో తల్లిదండ్రులను ఒత్తిడి చేసేవారు. వీథిలో పిల్లలు గిలకలతో వెడ్తూన్నపుడు బాలకృష్ణుడు గోపికలతో వెడుతూన్నట్లుండేది. దసరాదశవర్షోత్సవాన్ని ఆనందాన్ని బాల్యంలో అనుభవించినవాణ్ణి కాబట్టి, ఎనిమిది దశాబ్దాలనంతరం కూడా మరచిపోలేకున్నాను. ఎందువల్లనో విద్యాశాఖ దీన్ని నిలుపుదల చేసింది.

**తా**లూకా కేంద్రాల్లో కోర్టులో పనిచేస్తున్న ఉద్యోగులు, తాలూకా ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగులు పోటీపడి జమ్మివృక్షపు పూజ ఊరేగింపు ఉత్సవములను పోటాపోటీలుపడి రకరకాల రంగు రంగుల బాణాసంచాలు కాలుస్తూ, బాండు వాద్యమేళం, రాండోలు వాయిద్యమేళంతో ఊరేగేవారు. రాత్రి జరిగే ఈ ఉత్సవ ఊరేగింపును చూడడానికి చుట్టుపక్కల ఊళ్ళనుంచీ గ్రామస్తులు ఎడ్లబండ్లను కట్టుకుని కుటుంబసమేతంగా వచ్చి, ఊరేగింపు ఆగే ఆయా కేంద్రాల్లో నిలిచిచూస్తూ ఉండేవారు. ఒక్కొక్క చోట కోర్టు ఉద్యోగస్థుల ఊరేగింపు, తాలూకా ఉద్యోగస్థుల ఊరేగింపు ఎదురయ్యేసరికి గ్రామాలనుంచీ వచ్చిన పిల్లలూ పెద్దలూ ఒకటే కేరింతలు ఈలలు, నృత్యాలూ! ఆ దసరా చందాలను మామూళ్ళ వసూలుగా ప్రభుత్వం నిషేధించిందో యేమో మరుగునపడి పోయింది. ఇప్పుడా సందడే లేదు. బాలానందం కొరవడింది. ●




ధర రూ. 1100/- మాత్రమే

## గోమతి చక్రవృక్షం

Gomathi Chakra Tree



ఈ చక్రాన్ని మామూలు కోణంలో ఉంచినప్పుడు ఆరు సంఖ్య, తలక్రిందులుగా ఉంచినపుడు తొమ్మిది సంఖ్యను మీరు గమనించవచ్చు. సంఖ్యాశాస్త్రంలో '6' శుక్రునికి, '9' కుజునికి చెందుతాయి. అంటే వీటివలన శుక్ర రాహువుల సంయోగ పిశాచదోషం, శుక్రకేతువుల సంయోగ వియోగ దోషము పోతాయి. జాతకంలో కుజ, శుక్రులు వక్రీకరించివున్నపుడు ప్రేమలో విఫలం కావడం లేదా వివాహమై రతికి ఆసక్తిని కనబరచకపోవడంవంటి దోషాలు సైతం ఈ గోమతీచక్ర వృక్షాన్ని పూజించడం ద్వారా నివారింపబడుతాయి. జీవితంలో విడాకులూ, కోర్టు వరకు వెళ్ళకుండా కాపాడుతుందీ వృక్షం. పురుషుల్లో నపుంసకతనూ, స్త్రీలలో గొడ్రాలుతనాన్ని నివారించగల శక్తి వీటికి వున్నది. స్త్రీలకు సుమంగళిత్వాన్ని ప్రసాదిస్తుంది. ✍ చల్లా జయదేవానంద శాస్త్రి

పై పవిత్ర వస్తువు కావల్సినవారు మాకు ఫోన్ చేసి అడ్రస్ తెలియజేస్తే పూజ చేసి, పోస్టల్ ఖర్చులు మేమే భరించి వి.పి.పోస్ట్ ద్వారా పంపగలం. మీరు పోస్ట్‌మాన్‌కు పైన తెలిపిన అమౌంట్ మాత్రం కట్టి ప్యాకెట్ తీసుకోవచ్చు.

**భక్తిటుడే పవిత్ర సామాగ్రి పరిశోధన నిలయం**

**Bakthitoday Pavithra Saamagri Parisodhana Nilayam**

Balabharathi Nilayam, 49/21A, Rangarajapuram Main Road, Kodambakkam, Chennai - 600024

Since 1975

*T&C Apply

**Ph. : 044-24837505, 09840259871**

Visit : •www.bakthitoday.blogspot.com •www.indiamart.com/bakthitoday-pavithra

# తండ్రి కావడం సులభం - మంచి కొడుకుల తండ్రి కావడం అదృష్టం!! సతీమణి మంచిదైతే- సంసారం సుఖమయం!!



**సుగుణవంతురాలు సుదతియై యుండిన**
**బుద్ధిమంతులగుచు పుత్రులొప్ప స్వర్గమేటి కయ్య సంసారికింక** – అన్నాడు వేమన. ఆయనకు భార్యాపిల్లలూ లేకపోయిననూ, అన్నావదినలపై గల మమతాను రాగాలూ, వారి పుత్రిక జ్యోతిపైన పెట్టుకున్న అపారవాత్సల్యమూ చూచి ఈ పద్యం వ్రాసిఉండవచ్చు.

"సుగుణవంతురాలైన భార్య ఉన్నప్పుడు, గుణవంతులైన కుమారులు తప్పక ఉంటారు. అలాటివారందరూ ఇంటనున్నపుడు– ఇక వేఱే స్వర్గమెందుకు అన్న భావనలో ఎంతో నిండైన అర్ధముంది. ఆదిశంకర భగవత్పాదులవారు అస్ఖలిత బ్రహ్మచారియైనప్పటికినీ 'సౌందర్యలహరి తొలిశ్లోకంలోనే

**"శివ శ్శాక్త్యా యుక్తో యది భవతిశకః ప్రభవితుమ్**– అని ప్రారంభించారు.

–అమ్మా పరమేశ్వరీ! సర్వమంగళప్రదానమైన తల్లీ! నిన్ను చేరినపుడే శివ భగవానుడు సర్వ ప్రభావోపేతుడై సృష్టి కార్యాసక్తుడౌతున్నాడు– అంటారు. సత్యమే కదా! వారి తనయులు రాక్షససంహారం చేయగల సమర్థులూ తల్లిదండ్రుల పట్ల అధికభక్తి ప్రపత్తులు కలవారయ్యారు.

మానవసమాజంలో వేద ధర్మబద్ధమైన వివాహం చేసుకున్నవారినీ, సద్భక్తి యుతుల్నీ, సంస్కారబద్ధంగా, పరస్పరాన్యోన్యభావుకులై సత్సంతానమును కనుటయే గాకుండా వారిని నీతిమంతులుగా సమాజప్రయోజకులుగా తీర్చిదిద్దబడినపుడే, వారు తల్లిదండ్రులపట్ల భక్తి గౌరవ, వాత్సల్యములుగల వ్యక్తులుగా మసలుతూ, తల్లితండ్రులకు మంచి పేరును తీసుకుని వస్తారు.

పుట్టగానే బిడ్డకు స్తన్యాన్నిచ్చి పెంచుతూ, ఎదుగుతుండగా గోరుముద్దలు చేసి నోటినందు పెడుతూ, వాడికి ప్రాయం వచ్చేవరకూ సాకుతూ, వాడి బుల్లిబుల్లి నడకలు తడబడకుండా, వాడి ఆరోగ్యం కొఱకు పచ్చి బాలింతరాలుగా చనుపాలు యిస్తూన్నపుడు, వాడికే అనారోగ్యమూ కలుగకుండేట్టు పత్యములు చేస్తూ కనురెప్పల్లా చూచుకునే ఆ తల్లి త్యాగమును ఎవరు లెఖ్ఖగొనగలరు. వాడు ఎదిగిన తరువాత వాడి పోషకాహారములను తెచ్చిపెట్టుటకు శ్రమపడుతూ, వాడి ప్రాథమిక విద్యాస్థాయి నుంచీ, పెద్దపెద్ద చదువుల వరకూ కష్టపడి ఋణాలను చేసి చదివించి, ఇంటివద్ద వాడికోసం తల్లితండ్రులిరువురూ నీతిశతకాలనూ, పురాణగాథలను వినిపిస్తూ, సకల విద్యావంతులుగా చేస్తూ క్రమశిక్షణతో పెంచి, వాడికో ఉద్యోగం వచ్చి, సత్సాంప్రదాయమైన వధువును చూచి, వేదధర్మపరంగా వివాహం చేసి, వారికి సంతానం కలిగి మనుమలు పుట్టేవరకూ తల్లితండ్రుల త్యాగనిరతి, వారి సుఖజీవిత త్యాగాన్నీ అక్షరాలలో చెప్పగలమా? పుత్రులు శక్తిమంతులై సంపాదనపరులై ఉండి, తలితండ్రుల పట్ల వాత్సల్య గౌరవ ప్రతిపత్తులై కలిగి ఉంటూ వారిని దైవసమానులుగా గౌరవించకపోయిననూ, ఆదరంతో చూచిననాడే కదా భగవంతుడు కూడా సంతసిస్తాడు. కలిమాయా ప్రభావంలో వివాహమై ఉద్యోగాలురాగానే వేరుకాపురాలుగా విడిపోయే కొడుకులుంటారేమోనని వేమన ఆనాడే ఊహించి

**తల్లితండ్రుల యందు దయలేని పుత్రుడు**
**పుట్టనేమి వాడు గిట్టనేమి పుట్టలోని చెదలు పుట్టవా, గిట్టవా**
–అని ఆనాడే అన్నాడు.

బిడ్డలెలా వాత్సల్యహీనులైననూ 'కు'స్వభావం గల తల్లీ, 'కు' స్వభావుడైన తండ్రీ ఉండనే ఉండడు. బాధ్యతలు తీరినవారు పూర్వం వానప్రస్థాలకు పోయేవారు. ఇప్పుడు ఆశ్రమాలకు వెళ్ళిపోతున్నారు.

ఇలాటి సంస్కృతీ సంస్కారం నేర్పడానికి 'రామాయణం' గ్రంథంలో శ్రవణుడనే ఓ వైశ్యబిడ్డ తన వృద్ధ తల్లితండ్రులను, పైగా వారు వృద్ధులూ, అంధులూ! వారినొక కావిడలో మోసుకుని తీర్థయాత్రలు చేయిస్తాడు. అందుకే రామాయణమును నీతి, ధర్మయుక్తమైన గ్రంథంగా వాల్మీకి తీర్చిదిద్దాడు. ఎంతోమంది మనదేశంలో రామాయణం చదువుతున్నారు. రామాయణ గ్రంథం పరదేశాలకు పోయింది. రాముణ్ణి విమర్శించే గొప్పగొప్ప వ్యక్తులు మనదేశంలో పుట్టుకొని వస్తున్నారు. పాశ్యాత్య వాతావరణం మనల్ని మృగాలుగా తీర్చిదిద్దుతున్నది.

ఎంతమంది తల్లితండ్రులు బిడ్డల్ని క్రమశిక్షణతో పెంచుతున్నారు? ఎంతమంది కొడుకులు తల్లితండ్రులను భక్తితో, వాత్సల్యంతో చూస్తున్నారు. తండ్రి ఆస్తిని లాక్కుని స్మశానంలో విడిచి వస్తున్న విషయాల్ని ప్రసా(చా)ర మాధ్యమంలో మనకు కనిపిస్తున్నది. తల్లితండ్రులను హత్యలు చేయడానికి కూడా వెనుకాడనివారి వార్తలను ప్రచురిస్తున్నది. వాళ్ళు సేవలుచేస్తున్నవారులే. తల్లితండ్రులు బాధ్యతలు నెరవేర్చి విశ్రమించేవేళ వాళ్ళని కంటికిరెప్పలా కాయవలసిన బాధ్యత సంతానంపై ఉన్నదని గ్రహించాలి. ఈ ఆధునిక ప్రపంచంలో చాలామంది తల్లితండ్రుల పట్ల బాధ్యతలల్ని ఎంతవరకు నెరవేరుస్తున్నారని ప్రశ్నించుకోవాల్సి వుంది. ఈ ప్రశ్నకి లేదనే సమాధానం వస్తుంది. అందువల్లనే అభ్యుదయ కవులు, రచయితలు తల్లిదండ్రుల పట్ల బాధ్యతల్ని గుర్తుచేసే రచనలు చేయాలి. యేరుదాటి తెప్పను తగలేసే సంస్కృతికి నేటితరం తిలోదకాలివావ్వల్సి వుంది. తల్లితండ్రుల పట్ల బిడ్డలకి వాత్సల్యములున్న సంస్కృతికి వారసులం మనం. తల్లితండ్రుల మనసును ఆవిష్కరించే దిశగా ఉన్న ఈ క్రింది పద్యాన్ని ఉదహరిస్తున్నారు.

**"బిడ్డభవితగోరి బిచ్చయిన యెత్తు బాధ్యతగన్ యెంచి బడికి పంపు**
**ఎదిగి, ఎత్తులందున ఒదిగి యుండన్ మనసు పరిమళించుమల్లె లాగ!"**


**SRI RAJARAJESWARI JEWELLERY**

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

*If you want Comfortable Stay - Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114

# శ్రేయస్సూ, యశస్సూ, ఆరోగ్యం ఆయుష్షు ప్రసాదించు దేవత!

## గాయత్రీదేవిని అన్ని వర్ణాలవారూ అన్ని మతాలవారూ ఆరాధించవచ్చు!



గాయతం త్రాయతే గాయత్రీ అంటారు. ఎవరైతే త్రిసంధ్య లలో గాయత్రి చేస్తారో, వారికి గాయత్రీమాత అత్యంత శ్రేయస్సునూ యశస్సునూ ఆయుష్షునూ, ఆరోగ్యాన్నీ, ఐశ్వర్యాన్నీ ప్రసాదిస్తుందని పెద్దలు చెబుతారు. అయితే గురూపదేశంగా గాయత్రి నేర్చుకుంటే సర్వశుభాలనూ యిస్తుందని గాయత్రీమంత్ర ద్రష్ట విశ్వామిత్ర మహర్షి చెప్పారు. ఆయన బ్రాహ్మణుడూ, బ్రహ్మఋషీ కాడు. బ్రహ్మర్షి కావ డానికి కొన్ని వందల సంవత్సరాలు త్రిసంధ్య వేళల్లోనే గాకుండా నిరంతరమూ తదేకంగా గాయత్రి జపించి విశిష్ట మహర్షిగా బ్రహ్మర్షిగా పూజింపబడే వశిష్టలవారిచే బ్రహ్మఋషియని పిలిపించుకున్నారు.

బ్రాహ్మణులొక్కరే గాయత్రీ మంత్రం జపించా లని శాస్త్రం నిర్ణయమేమీ చేయలేదు. నిజానికీ మంత్రద్రష్టయిన విశ్వామిత్రుడు సుక్షత్రి యుడు. కోపావేశములూ అహంకారం కల వాడు. బ్రహ్మర్షియైన విశ్వామిత్రునితో తన ఆధిక్యతపై విరోధంపెట్టుకున్నాడు. సత్య సంధుడైన ఇక్ష్వాకువంశరాజు హరిశ్చంద్రుణ్ణి సత్య సంపన్నతను భ్రష్టుపట్టించాలని, ఆ రాజును ఎంతో కష్టాలపాలు చేసాడు. రాజ్యం దక్కించుకుని, రాజును అడవులకు పంపడమే గాకుండా భార్యా కుమారుణ్ణి విక్రయింపచేసి చివరకు హరిశ్చంద్రుణ్ణి కాటికాపరికి విక్రయిస్తాడు. విశ్వామిత్రుడు క్షత్రియుడు కాబట్టి పట్టుదల యెక్కువ అహంకారి ఈ అహంకారికి ఖగోళమండలం నుంచీ 'ఓం' అను శబ్దం వినిపించింది. ఈ శబ్దం ఆయన తపస్సుకుపక్రమిస్తున్న సమయంలో వినిపించింది. అంతలో ఆయన 'ఓం'కారమును మునులందరకూ విశదపరిచాడు. వారందరూ 'ఓంకారనాదం' భగవంతునికి ప్రతీక. 'ఓం ఇతి ఏకాక్షరం బ్రహ్మ' అని స్తుతిస్తూ ఏకాక్షర స్వరూపునిగా భగవంతుని కొలువవచ్చునంటూ సిద్ధసమాధియోగంలో కూడా భగవంతుణ్ణి స్తుతించే ఉద్గతి నాదం' అన్నారు.

**ఓం భూర్భువస్సువః** అన్న ప్రథమపాదం అనగానే 'ఓం ప్రణవనాదం, 'భూర్' అంటే భూమి, 'భువ' అంటే సూర్యమండలం, స్సువః అత్యంత వేగంగా పయనించే పాలపుంతలు అతిశక్తివంతమైన ప్రణవనాదమైంది. తత్ సవితుర్ వరేణ్యం' అను రెండవ పాదంలో 'తత్' భగవంతుడు, 'సవితుర్' సూర్యుడని పిలువబడే నక్షత్రం, 'వరేణ్యం' నమస్కరిస్తున్నానని అర్థం. అనంతశక్తి స్వరూపుడు, తేజోమయుడు అయిన భగవంతునికి నమస్కరిస్తున్నాను. భగవంతుడు రూపురేఖా విశేషాలకు అతీతుడు కాబట్టి ఆయన్ను గుర్తించే విశేషణలను తెలియజేస్తూ అనంతతేజోమయమైన నక్షత్రాలకాంతి వలె, అనంతశక్తివంతమైన ఓంకారనాదం వలె భగవంతుడుంటాడని మంత్రద్రష్టయైన విశ్వామిత్రుడు పేర్కొన్నాడు.

**భర్గోదేవస్య ధీమహిః** మూడవ పాదం. 'భర్గో' అంటే కాంతి, 'దేవస్య' అంటే భగవంతుని, 'ధీమహీ' ధ్యానం చేయాలి. అనేకకోట్ల నక్షత్రాల కాంతి ఒకచోట కలిస్తే ఎలా ఉంటుందోననే భావన భగవంతునిపై లగ్నపరిచి, ఆ తేజస్సును భగవంతునిగా భావించి అనంత తేజోమయుడైన భగవంతుణ్ణి అనంత శక్తివంతమైన ఓంకార నాదంతో జపించాలి.

**ధియోయోనాః ప్రచోదయాత్** చివరిపాదం. ధియో (జ్ఞానాన్ని) 'యో' ఎవరైతే, 'నః' మనకు 'ప్రచోదయాత్' సరియైనమార్గంలో మనకు జ్ఞానమార్గం తెలుసుకోవడానికి దారిని చూపిస్తారో ఆయన్నే భగవంతుడని స్తుతిస్తున్నాను.

భూమి, గ్రహాలు, నక్షత్రాలు అంతరిక్షంలో అత్యంతవేగంతో చరించడం వలన ఉత్పన్నమవుతోన్న **ఓంకారమని** పిలువబడే భగవంతుడికి, అలాగే అనేక కోట్ల నక్షత్రాల వెలుగు ఒక్కటై ప్రకాశించే కాంతి స్వరూపుడైన భగవంతుడికి, జ్ఞానాన్ని ప్రసాదించి, సరైన రీతిలో దారిచూపే తేజోమయుడైన ఆ భగవంతుడికి నమస్కరిస్తున్నాము. అని విశ్వామిత్ర మహర్షి భగవానుని రూపాన్ని ఎలా భావించాలో మానవాళికి తెలియజేశాడు. ఈ విధంగా నిరంతరం అనంతకోట పాలపుంతల చలనం చే ఉత్పన్నమైన శక్తి విశ్వమంతా కప్పబడి ఉంది. దీన్నే ప్రణవస్వరూపం అని అంటారు. ఇంతటి తేజోమయ శక్తి సంపన్నమైన 'ఓం' అనే మంత్రాక్షరాన్ని అనేక మతాలవారు, కొద్ది మార్పులు చేసి తమ మతాలకు అన్వయింపజేసుకున్నారు. పోతనగారు ఆ ప్రణవ స్వరూపాన్ని మహాభాగవత గ్రంథంలో గూఢంగా చెప్పారు.

**ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై;**
**యెవ్వని యందుడిందు బరమేశ్వరు డెవ్వడు? మూలకారణం**
బెవ్వఁడనాది మధ్యలయుఁడెవ్వడు? సర్వమూ దానయైన వాఁ
డెవ్వడు? వాని నాత్మభవు నీశ్వరునే శరణుంబు వేడెదన్.

గాయత్రీమంత్రం ఒక జీవన దర్శనం, ఒక ఫిలాసఫీ. అది జీవించే కళ. అది ఒక ఆలోచనా విధానం. ఒక జీవన సరళి. సమాజ నిర్మాణానికి ఒక పద్ధతి. అది విశ్వశాంతికి మూలమంత్రం. గాయత్రీ మంత్రం ఒక దివ్య జ్ఞానం. గాయత్రి దేవమాత. గాయత్రీ ఉపాసన వల్ల మనిషి దేవత అవుతాడు. గాయత్రిలోని 24 అక్షరాలతో నిండి ఉంది. ధర్మం, నీతి, జీవితం, కళ, సామాజిక వ్యవహరణలను గురించిన బోధ, మనిషి యొక్క ఆలోచనలనూ, భావనలనూ, లక్ష్యాన్నీ, దృక్పథాన్నీ క్షాళనచేస్తే అతడి శారీరక, మానసిక క్రియలలో సత్వగుణమూ, ధర్మనిష్టా పెంపొందుతాయి.

- ⇛ **గాయత్రీ మంత్రం వేదశాస్త్రాల సారం.**
- ⇛ **ఆత్మపరాయణత్వంలోనే మన శ్రేయస్సు గాయత్రీ మంత్రం అంతరార్థం అదే.**
- ⇛ **గాయత్రీ మంత్రంలోనే సకల సృష్టి**
- ⇛ **అకాల మరణాన్ని హరించే విశిష్ట మంత్రం**
- ⇛ **మనస్సును స్థిరపరిచే దివ్యౌషధం.**
- ⇛ **శారీరక విషయాలను తప్పించి ఆత్మానందాన్ని ప్రసాదించే దివ్య మంత్రం.**

గాయత్రిలోని అక్షరాలు చేసే మహాబోధలను అనుసరిస్తే– 2 ప్రక్రియ అమలు జరుగుతుంది. కనుకనే గాయత్రి వేదశాస్త్రాల సారం.

### ఓం

ప్రకృతి అంతరాళంలో 'ఓం' వంటి ధ్వని ప్రతి క్షణం ఉత్పన్నం అవుతోంది. ఈ పరమేశ్వర నామాన్ని సూక్ష్మ ప్రకృతి ప్రతిక్షణం జపిస్తోంది. నినదిస్తోంది. కనుక ఈ నామం అకృత్రిమం, స్వయం వ్యక్తం సర్వ శ్రేష్ఠం అయినది, ఆస్తికత అంటే అర్థం– సత్వ గుణాన్నీ, దైవీయ, ఈశ్వరీయ, పారమార్థిక భావన లనూ హృదయంలో నింపుకోవడం. నాస్తికత అంటే అర్థం– తామసంతో, అసురత్వంతో, భోగవాదంతో స్వార్థంతో కూడని వాసనలలో మునిగిపోవడం.

ఓంలో **అ ఉ మ్** అనే మూడు అక్షరాలు కలిసి ఉన్నాయి. 'అ' అంటే ఆత్మపరాయణత్వం; మనస్సును శారీరక విషయాలనుండి తప్పించి ఆత్మానందంలో ఓలలాడడం. 'ఉ' అంటే అర్థం ఉన్నతి, శారీరక, మానసిక, ఆర్థిక ఉన్నతి.

### గాయత్రి వల్ల భయరాహిత్యం

**అంపశయ్యపై పడి ఉన్న భీష్మపితామహుణ్ణి యుధిష్టరుడు అడిగాడు– ఏ మంత్రాన్ని జపిస్తే మనిషికి శాంతి, పుష్టి, తుష్టి రక్షణ, నిర్భయత్వం లభిస్తాయని. భీష్మపితామహుడు ఇలా జవాబిచ్చారు–**

**"ఓ యుధిష్టరా! గాయత్రి జపం చేసే వ్యక్తికి ధనం, గృహం, ఇతర భౌతిక వస్తువులన్నీ లభిస్తాయి. దుష్టులు, రాక్షసులు, అగ్ని, జలం, వాయువు, సర్పాలు - వేటివల్లా అతడికి భయం ఉండదు. నాలుగు వర్ణాలవారూ, నాలుగు ఆశ్రమాలవారూ దీన్ని జపించి సఫలత పొందవచ్చు. ఈ మంత్రం జరిగే చోట పిల్లల అకాల మరణం ఉండదు. ఎవరికీ ఎలాంటి కష్టమూ కలుగదు.**

# వ్యక్తి వల్లన కుటుంబం మారినప్పుడు దేశం ఎందుకు మారదు!



**అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నం పెట్టిన వారిని అన్నదాతా సుఖీభవ అనాలి.**


"భారతదేశం అగ్రగామిగా ఎదగాలి. ప్రపంచానికే నాయకత్వం చేపట్టాలి. యువతరంలోని చైతన్యశక్తిని దేశభక్తిగా మార్చినప్పుడే ఇది సాధ్యమవుతుంది. లీడ్ ఇండియాను చూస్తుంటే నా కల నిజమవుతుందన్న ఆశ కలుగుతోంది... ఎనిమిదేళ్ళ క్రిందట లీడ్ ఇండియా–2020 ఫౌండేషన్ ఆవిర్భావసభలో డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం అన్న మాటలు. కలాం కలలుగన్న భారత్ ఆవిర్భవించాలంటే యువతరాన్ని ఆ దిశగా నడిపించడానికి ఎలాంటి కార్యాచరణ అమలుపరచాలి? ఆ మహాయజ్ఞాన్ని ఎక్కడి నుంచి ప్రారంభించాలి? వంటి ప్రశ్నలెన్నో లీడ్ ఇండియా స్థాపించకముందు సుదర్శన్ ఆచార్యను వేధించాయి. వ్యక్తికైనా, దేశానికైనా మార్కులొచ్చే చదువులు కాదు. మార్పు తెచ్చే చదువులు కావాలి. వ్యక్తి అభివృద్ధి దేశాభివృద్ధికి తోడవ్వాలి. వ్యక్తి అభివృద్ధికి దేశం బలవ్వకూడదు. విలువైన ఆస్తుల్ని కాదు విలువలున్న జీవితాన్ని సంపాదించుకోవాలి. ఈ లక్షణాలతో ఎవరికివారు పైకొస్తే.. దేశం దానంతట అదే పైకొస్తుంది. ఆచార్య మిత్ర బృందానికి స్పష్టత వచ్చింది. అప్పుడు మొదలైంది 'లీడ్ ఇండియా 2020 ఫౌండేషన్. ఎల్ఇడి అంటే ఎల్– లీడర్‌షిప్ (నాయకత్వం), ఇ– ఎక్సలెన్స్ (నైపుణ్యం) ఎ – అవేర్‌నెస్ (చైతన్యం), డి– డెవలప్‌మెంట్.

పిల్లల నడవడికకు బాల్యంలోనే బీజంపడాలి. అది వ్యక్తి వికాసానికి బాటలు వేయాలి. అందరూ ఇదే దారిలో నడిస్తే, ఏ రంగంలోకి వెళ్ళినా నీతిగా పనిచేస్తారు. సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తారు. దేశానికి సహజవనరులో, ఆస్తులో, అంతస్తులో సంపదకాదు. ఇలాంటి వ్యక్తులే నిజమైన సంపద. వ్యక్తి అభివృద్ధి దేశాభివృద్ధికి దారి తీయడమంటే ఇదేనని లీడ్ ఇండియా అభిప్రాయం. అలాంటి పౌరుల్ని తయారు చేయాలంటే– ఏం చేయాలి? నీతి వాక్యాలు, సూక్తులు చెబితే విని మరచిపోతారు. ఆచరించడం అలవాటు చేస్తే, మెల్లగా నేర్చుకుంటారు. లీడ్ ఇండియా ఇలాంటి పంథానే ఎంచుకుంది. చెప్పటానికి చిన్న విషయాలైనా, పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఇంతకంటే ప్రభావశీలమైన అంశాలు నేటి పాఠ్యాంశాల్లో కనిపించవు. విద్యార్థులకు తరగతి గదుల్లో వీటిని వినే భాగ్యం కలగడం లేదు. ఆ భాగ్యం కలిగించేందుకు లీడ్ ఇండియా ఒక మాడ్యూల్ రూపొందించి పాఠశాలల్లో ప్రవేశపెట్టి విజయవంతమైంది. వారి ప్రణాళికలో ఉన్న ప్రతి చిన్న పనీ పిల్లల్లో అద్భుతమైన మార్పు తీసుకొస్తున్నది. అన్నీ చిన్న చిన్నవే. అందరికీ తెలిసినవే. శుభ్రతను పాటించాలి. ఇంటిని బడిని చక్కదిద్దుకోవాలి. తిండి సరిగ్గా తినాలి. వేసుకునే దుస్తుల్ని, వాడే వస్తువుల్ని చక్కగా సర్దిపెట్టుకోవాలి. ఇలా చేస్తే ఒకరిమీద ఆధారపడే తత్వం పోతుంది. ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడే శక్తి సమకూరుతుంది. పొద్దునే లేచి మంచి నీళ్ళు తాగాలి. అయిదు ఆసనాలు వేశాక కాలకృత్యాలు పూర్తి చేసుకోవాలి. స్నానం, ధ్యానం, జ్ఞానం, కీర్తన, సత్‌గ్రంథ పఠన అనే పంచ నియమాలను అనుసరించాలి. ఇవన్నీ పాటిస్తే క్రమశిక్షణ అలవడుతుంది. ఆరోగ్య చైతన్యం పెరుగుతుంది. వ్యక్తి ఆరోగ్యమే దేశ సౌభాగ్యం.

భోజనం చేసేటప్పుడు కొన్ని పద్ధతుల్ని పాటించాలి. పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశం కరుణిస్తే, రైతు శ్రమిస్తే అందరికి తిండి దొరకుతుంది. అలాంటి తిండిని ఇచ్చిన వాళ్ళకు కృతజ్ఞత చెప్పుకోవడం ధర్మం. భోజనానికి ముందు పంచభూతాలను, పండించిన రైతును ప్రార్థించాలి. కృతజ్ఞతాభావం కలిగేందుకు ఇంత కంటే మంచి అలవాటు మరొకటి లేదు. భోజనం అయ్యాక ఎవరి ప్లేట్లను వాళ్లే కడుక్కోవాలి. ఇది పని సంస్కృతిని నేర్పుతుంది. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలి. ఇది పర్యావరణ స్పృహను కలిగిస్తుంది. పిల్లల బాధల్ని పిల్లలే బాగా అర్థం చేసుకుంటారు. అందుకే బడిమానేసిన పిల్లల్ని తోటి విద్యార్థులే తిరిగి బడిలో చేర్పించాలి. చదువుకోని ఆడపిల్లలకు ప్రాధాన్యమిచ్చి వారికి పుస్తకాలు కొనివ్వడం, చిన్నచిన్న ఫీజులు చెల్లించడం చేయాలి. ఇది కష్టంలో ఉన్నవాళ్ళకు సాయపడేగుణాన్ని అలవరుస్తుంది. వారిని ప్రగతి వైపు నడిపించడం అనేది గొప్ప విషయం. అప్పటి నుంచి నేను ప్రజల మనిషినయ్యాను' అని చెప్పారు ఐఏఎస్ అధికారి ఎం. రవిచంద్ర.

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ... ఇవన్నీ పాఠశాలల్లో గోడలమీద కనిపించే సూక్తులు. వీటిని రోజూ చూస్తుంటారు. నీతి బోధమాత్రం బుర్రకు ఎక్కదు. సూక్తుల్లోని అంతరార్థాన్ని ఒంటబట్టించేందుకు లీడ్ ఇండియా ఫౌండేషన్ పూనుకుంది. పాఠశాలలో తల్లిదండ్రులకు, గురువులకు పాదపూజలు చేయాలి. వారి నుంచి సంపూర్ణ ఆశీర్వాదం పొందాలి. దీనివల్ల జన్మనిచ్చిన అమ్మనాన్నకు రుణపడి ఉండటం. జ్ఞానమిచ్చిన గురువుకు విధేయులుగా మెలగడం పిల్లలు నేర్చుకుంటారు. ఇది ఆ రోజు కార్యక్రమానికే పరిమితం కాదు. నిద్రలేస్తూనే రోజూ తల్లిదండ్రులకు నమస్కరించాలి. ఇలా చేస్తే బిడ్డకు, కన్నవారికి అనుబంధం బలమవుతుంది. ఆ సంబంధం కుటుంబ సంబంధాలను పటిష్టం చేస్తుంది. "ఏడెనిమిదేళ్ళ కిందట శిక్షణ పొందిన విద్యార్థుల్ని నేటికీ గమనిస్తున్నాం. మిగిలినవారికంటే వీరి ప్రవర్తన, గుణగణాలు ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉన్నాయి. కొందరు పిల్లలైతే వాళ్ళ తల్లిదండ్రుల వ్యసనాలను సైతం మార్చగలిగారు. వ్యక్తివల్ల కుటుంబం మారితే దేశం మాత్రం ఎందుకు మారదు?" అంటున్నారు ఆ సంస్థకు చెందిన పి.వి.బి. భాస్కర్.

## విలువల కోసం అన్వేషిస్తూ...



డాక్టర్ ఎన్.బి. సుదర్శన్ ఆచార్య

ఒకవైపు దేశం అభివృద్ధి అవుతోంది. మరోవైపు విలువలు పతనమైపోతున్నాయి. ఈరోజు అన్ని రంగాలు భ్రష్టుపట్టిపోవడానికి ఈ పతనమే కారణం. విలువలున్న సమాజంలో మనుషులు సుఖంగా జీవిస్తారు. మన జీవితాలను ఇంతగా ప్రభావితం చేయగల విలువను తిరిగి ఎలా పెంపొందించాలి? అన్నదే నా ఆలోచన. ఎంతోమంది ప్రముఖులతో చర్చించాను. పలు రకాల పుస్తకాలను చదివాను. ఈ ప్రయాణంలో.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'మానవ విలువలు' మీద పిహెచ్‌డి చేశాను. అంతకు మునుపు కొందరు మిత్రులతో కలిసి చిన్మయ బాలల శిక్షణ శిబిరం నడిపాను, ఈ క్రమంలోనే అబ్దుల్ కలామ్ నన్ను ఆకర్షించారు. ఆయనలోని దేశభక్తి నాకు స్ఫూర్తినిచ్చింది. కలాం మీద పరిశోధన చేసి 'కలామ్స్ కాల్ టు నేషన్స్' అనే పుస్తకాన్ని రాశాను. అప్పటి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ కాకర్ల సుబ్బారావు ఆ పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని రాష్ట్రపతిగా ఉన్న కలాంకు అందజేశారు. కలాం ఢిల్లీకి వెళుతూనే నాకు ఫోన్‌చేసి 'నీ పుస్తకం చదివాను మీ ఆలోచనలు బాగున్నాయి. మనమంతా కలిసి దేశం కోసం పనిచేద్దాం" అన్నారు. ప్రస్తుతం మనదేశంలో 54శాతం మంది పాతికేళ్లలోపు వాళ్లున్నారు. అందులో 34 శాతం మంది పాఠశాల విద్యార్థులు. వారందర్నీ కలుపుకుని 2020 నాటికి దేశం అగ్రగామి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పరాయి పాలన నుండి విముక్తి కోసం క్విట్ ఇండియా జరిగింది. వ్యక్తి అభివృద్ధీ దేశాభివృద్ధి అనే లక్ష్యం కోసం రెండో జాతీయ ఉద్యమం లీడ్ ఇండియా. ఆ ఆశయంతోనే 2007 ఆగస్టు 15న మెదక్‌లో కలామ్ చేతుల మీదుగా లీడ్ ఇండియా 2020 ఫౌండేషన్ ప్రారంభమైంది. ఆయనే దీనికి చీఫ్ మెంటర్. శాంతాబయోటెక్స్ చైర్మన్ వరప్రసాదరెడ్డి, విజయ్ ఎలక్ట్రికల్స్ సిఎండీ డి.జె. రమేష్, హెటెరో డ్రగ్స్ సీఎండీ పార్థసారథిరెడ్డి, ఐఏఎస్, ఐపీఎస్‌లైన మన్మోహన్‌సింగ్, దుర్గాప్రసాద్, క్రీడాకారుడు పుల్లెల గోపీ చంద్‌లాంటి వాళ్ళు ట్రస్టీలుగా వ్యవహరిస్తున్నారు.



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



## పదమూడవ అధ్యాయము - క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము

**83**

**33. యథా సర్వగతం సౌక్ష్మ్యాదాకాశం నోపలిప్యతే**
**సర్వత్రావస్థితో దేహే తథాఽఽత్మా నోపలిప్యతే.**

**వ్యాఖ్య:-** దృశ్య ప్రపంచములో అతిసూక్ష్మమైన వస్తువు ఆకాశము. కావున దానిని దృష్టాంతముగ తీసికొని ఆత్మయొక్క నిర్లేపత్వ, సర్వవ్యాపకత్వ, సూక్ష్మత్వ, నిర్మలత్వములు బోధింపబడినవి. చిన్నచిన్న ఉపమానాల ద్వారా గొప్ప గొప్ప బోధనలు తెలియజెప్పుట గీతయొక్క ఒకానొక విశిష్టత. ఆకాశము అని చెప్పినందువలన ఆత్మ ఆకాశమని యెవరునూ భావింపరాదు. ఆకాశమువలె అతిసూక్ష్మమైదని మాత్రమే యెఱుంగవలయును. ఆకాశము బురద మొదలగువానియందు వ్యాపించియున్నను. వాని గుణదోషములచే అంటబడనట్లు, ఆత్మయు దేహమందంతటను వ్యాపించియున్నప్పటికిని, దాని సుఖదుఃఖాదులచేగాని, జననమరణాదులచేగాని ఏ మాత్రము అంటబడదు. మఱియు మేఘమునందు ఎన్ని మెఱుపులు, పిడుగులు, నీరు, వడగండ్లు, నలుపుదనము, శీతలత్వము మొదలైనవియున్నను, ఆకాశమునకు ఈ గుణదోషములు ఏవియు అంటనట్లు ఆత్మకున్ను శరీరసంబంధ, మనస్సంబంధ, సుఖదుఃఖాదులు ఏ మాత్రమున్ననూ అంటనేరవని చక్కగ భావనజేసి గంభీరాత్మస్వరూపుడుగ సాధకుడు స్థితుడై యుండవలెను. తాను వాస్తవముగ ఆత్మస్వరూపుడే కావున తనను దేహమునకు సాక్షిగాను, దేహాతీతుడుగాను చింతనజేయుచు దేహసంబంధబంధముగాని, సుఖదుఃఖాదులుగాని తనకు లేవని తలంచి గంభీరముగ, నిర్భయముగ, ఆనందముగ నుండవలెను.

“సర్వత్రాపస్థితోదేహే'- అని చెప్పినందువలన, (వెనుకటి శ్లోకమునందు తెలుపబడిన విధముగ) భగవంతుడు అతి సమీపమున- శరీరముననే- వర్తించు చున్నాడు. కావున పవిత్రాచరణచే వారిని హృదయమందే సాక్షత్కరించుకొన వలయును. శరీరము దేవనిలయము, దేవసన్నిధి యని భావించి దుష్కృత్యములను, పాప కార్యములను, పాప సంకల్పములను దరికి జేర్చరాదు. మఱియు ఏ జాతి వారైనను, ఏ మతమువారైననూ, స్త్రీయైనను, పురుషుడైనను తన శరీరమున దేవదేవుడగు జగన్నాథుడు నివసించుచున్నాడని నిశ్చయించి ధైర్యోపేతులై వారిని సాక్షాత్కారించుకొనుటకు శ్రీఘ్రముగా యత్నించవలెను. అతడు దేహమున ఎక్కడున్నాడోయని పంచకోశములను వెతకివెతకి, మనస్సును శోధించి తుదకు అతనిని కనుగొనుటలో విజయముగాంచవలెను. ప్రయత్నశీలునకు అతడు దొరికియే తీరును.

**34. యథాప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః**
**క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత.**

**వ్యాఖ్య:-** ఆత్మయొక్క నిర్లేపత్వమును ఆకాశదృష్టాంతము ద్వారా చెప్పి ఇపుడిక ప్రకాశత్వమును సూర్యుని దృష్టాంతముద్వారా చెప్పుచున్నాడు.- సూర్యుడు లోకమంతటికిని సాక్షిగ నున్నవాడై, ఈ లోకము నెట్లు ప్రకాశింపజేయుచున్నాడో, ఆ ప్రకారమే క్షేత్రజ్ఞుడగు పరమాత్మ దేహేంద్రియ మనోబుద్ధ్యాధి దృశ్యజగద్రూప క్షేత్రమునంతను ప్రకాశింపజేయుచు సర్వసాక్షియై వెలయుచున్నాడు. సూర్యుడు లేనిచో జగత్తు నిర్వీర్యమైపోవునట్లు ఆత్మతేజములేనిచో దేహేంద్రియ మనోబుద్ధ్యాదులన్నియు శక్తివిహీనములై పోవును.

‘కృత్స్నమ్’- అని చెప్పినందువలన కేవలము జాగ్రత్పదార్థములనే గాక స్వప్నసుషుప్త్యాదులందలి పదార్థములను, అట్లే భూతభవిష్యత్పదార్థములను గూడ పరమాత్మ ప్రకాశింపజేయుచున్నాడని భావము.

ఆత్మయొక్క ఈ నిర్లేపత్వ, ప్రకాశత్వ, సర్వసాక్షిత్వాది స్వభావములను, భగవానుడు తెలిపిన ఆయా దృష్టాంతములను స్మరించుట ద్వారా సాధకుడు లెస్సగా భావన చేయుచు తాను వాస్తవముగ అట్టి అసంగచిద్రూపుడేకాని దేహేంద్రియాద జడపదార్థములు కాదని దృఢముగా నిశ్చయింపవలెను.

**35. క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమన్తరం జ్ఞానచక్షుషా**
**భూతప్రకృతి మోక్షం చ యే విదుర్యాన్తి తే పరమ్.**

**వ్యాఖ్య:-** ‘ఏవమ్’- (ఈ ప్రకారముగా)- అని చెప్పుట వలన ఈ అధ్యాయమందు తెలుపబడిని దృగ్దృశ్యవివేకమే, క్షేత్రక్షేత్రజ్ఞులను గూర్చిన జ్ఞానమే కైవల్యప్రాప్తికి హేతువని నిరూపింపబడినది. కావున ఇది సామాన్యమైనది కాదనియు మోక్షానికి సోపానము వంటిదనియు, ముముక్షువులు గుర్తెఱింగి భగవద్వాక్యములపై విశ్వాసమునుంచి, అద్దానిని సాధించి తీరవలయును.

‘అన్తరమ్’-(భేదమును)- సామాన్యులందఱును దృగ్దృశ్యములను, క్షేత్రక్షేత్రజ్ఞులను కలిపివేయుచున్నారు. “నేనే దేహము, నేనే మనస్సు, నేనే సుందఱుడను, నేను ఫలానిజాతివాడను’- అని ఈ ప్రకారముగా జీవుడు క్షేత్రముతో నైక్యమొంది పోవుచున్నాడు. అదియే దుఃఖములకు కారణము. బంధహేతువదియే. వాస్తవముగ జీవుడు క్షేత్రజ్ఞుడగు ఆత్మయేకాని క్షేత్రము కాదు. తాను క్షేత్రమునకు (దేహాదులకు) సాక్షియగు క్షేత్రజ్ఞుడేయనియు, క్షేత్రము తనకంటె వేఱనియు, దుఃఖాదులను పొందునది క్షేత్రమే కాని తాను కాదనియు, తనద్దానికి వేఱుగా సాక్షిగా నున్నాడనియు విచారణచే తెలిసికొని, ఇట్టి జ్ఞానదృష్టి గలిగి ఈ రెండిటిని (క్షేత్రక్షేత్రజ్ఞులను) విభజించి చూచుటయే ఈ అధ్యాయమందు తెలుపబడిన బోధ.

“భూతప్రకృతిమోక్షం చ’- జీవుడు అనాదికాలము నుండి ప్రకృతి (మాయ)చే బద్ధుడైయున్నాడు. ఇపుడు జ్ఞానాదిసాధనలచే దాని నుండి విడుదలను బొందుటకై యత్నించుచున్నాడు. ప్రకృతి విమోచనమే ప్రతిజీవియొక్క పరమకర్తవ్యము. ప్రకృతి నుండి ఆ ప్రకారము విడుదలను బొందుటయే మోక్షము. మోక్షమనగా ఆకాశమునగాని, పాతాళమునగాని, లేక మఱియొకచోటుగాని ఉంచబడిన వస్తువుకాదు. అజ్ఞానవశమున ఇంతకాలము ప్రకృతితో గూడియున్న తాను, జ్ఞానదృష్టిని సముపార్జించి అద్దాని నుండి (ప్రకృతినుండి) విముక్తిని బొందుటయే మోక్షము. కనుకనే ‘జ్ఞానచక్షుషా’ అని చెప్పబడినది. కావున ప్రతివారును బంధవిముక్తికై జ్ఞాననేత్రమును, విచారణా సామర్థ్యమును, క్షేత్రక్షేత్రజ్ఞ విభేద పరిజ్ఞానమును తప్పక పొందవలసియున్నారు. వేఱుదారిలేదు. “నాకేల మోక్షము కలుగలేదు” అని ప్రశ్నించువారు ముందుగా తనకు జ్ఞాననేత్రము లభించినదాయని చూచుకొనవలెను. అట్టి జ్ఞానమో, చిరకాలము భగవంతుని భక్తితో సేవించుటవలన, ఆరాధించుట వలన సంప్రాప్తించగలదు. - (తేషాం సతతయుక్తానాం.. దదామిబుద్ధి యోగం) కాబట్టి భక్తిచే, ఉపాసనచే, పరోపకారాది పుణ్యకార్యములచే భగవానుని ప్రీతితో సేవించి, భగవత్కృపచే జ్ఞాననేత్రమును (బుద్ధియోగమును) బడసి తద్వారా క్షేత్రక్షేత్రజ్ఞుల మధ్యగల భేదమును తెలిసికొని తాను క్షేత్రజ్ఞుడేకాని క్షేత్రముకాదని భావించుచు జీవుడు మోక్షము నొందవలసి యుండును. దుఃఖరాహిత్యమునకు, పరమానంద ప్రాప్తికి జీవు డవలంబించవలసిన పద్ధతి యిదియేయని భగవానుడిచట అసందిగ్ధముగ చెప్పివైచిరి.

“యే విదుర్యాన్నిత తే పరమ్’”- అని ‘యచ్ఛబ్ద’ ప్రయోగము చేయుటవలన, ఎవరైనను సరియే, ఏ మతమువారైననూ, ఏ ఆశ్రమమువారైననూ, ఏ కులము వారైననూ, జ్ఞాననేత్రమును పొందినచో వారు తప్పక ముక్తులగుదురని స్పష్టము చేయబడినది. ‘యాన్తి’ అను పదముచే వారట్టి మోక్షస్థితిని నిస్సందేహముగ బడయగలరని నిరూపింపబడినది. కావున ముముక్షువులిక తమ బంధవిమోచనమునందేలాటి సంశయమును ఉంచుకొనక, భగవద్వాక్యములపై పరిపూర్ణ విశ్వాసముంచి ప్రయత్నపూర్వకముగ జ్ఞానదృష్టిని బడసి బ్రహ్మసాయుజ్యము నొందవలయును.


**ఓమ్**

**ఇతి శ్రీ మద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయం యోగశాస్త్రే**
**శ్రీ కృష్ణార్జునసంవాదే కర్మయోగోనామ త్రయోదశోఽధ్యాయః**

(తరువాయి వచ్చే సంచికలో)

# భగవంతుడు ఎక్కడో లేడు!

**– అవతార్ మెహర్ బాబా**



* పుణ్యాత్ములు భగవంతుడి ఆస్తి. పాపాత్ములు అప్పు. అప్పులు తీర్చటం, ఆస్తులు పెంచటం, అనాదిగా భగవంతుడు చేసే పని.
* అసలైన అంటరానివాళ్లు ఎవరంటే ఎవరి హృదయమందిరంలోకి వారు వెళ్ళి అక్కడ ఉన్న దేవుణ్ణి చూడలేనివారు.
* జిజ్ఞాస వున్నవాడికి భగవంతుడు ఎక్కడో దూరంగా లేడు. అతడిని చూడటం ఏమంత కష్టం కాదు. అతడు నీ నడినెత్తిన సూర్యునిలా ధగధగాయమానంగా వెలుగుతున్నాడు. నీవై నీపైన రకరకాల మానసిక సంస్కారాల గొడుకు ఎత్తిపట్టుకుని అడ్డు కనబడకుండా చేసుకున్నావు.
* మతానికి పనికిరాని వాళ్ళు ఇద్దరు– భౌతికవాది, ఆత్మజ్ఞాని. డబ్బంటే లెక్కచేయని వారు ఇద్దరు– తాగుబోతు, ఆత్మజ్ఞాని, మోహబంధం చుట్టుకోనివారు ఇద్దరు పసిబిడ్డ, ఆత్మజ్ఞాని. అనుభవపూర్వకంగా సత్యాన్ని తెలుసుకున్నవాడు భౌతికవాదిలా, తాగుబోతులా, పసిబిడ్డలా పైకి కనబడుతాడుగాని, అతడు వారి నుండి పూర్తిగా వేరైనవాడు. అనంతమైన భగవంతుడి అస్తిత్వంతో ఒకటైన వాడు.
* దివ్య ప్రేమ, మద్యపానం మతఛాందసులకు బహుదూరం. మొదటిది వాళ్ళ అనుభవానికి అందదు. రెండవదాన్ని వాళ్ళు ససేమిరా ఒప్పరు. మనిషికి రెండూ మత్తు కల్గిస్తవి. మతిమరుపులో పడేసేవి. తేడా అల్లా మద్యపాన ఫలితం. ఆత్మ విస్మృతి. దివ్యప్రేమ అనుభవం ఆత్మజాగృతి.
* భగవదనుభూతి పొందాక అన్ని తప్పులు సరిద్దిబడతవి. అన్ని గాయాలూ మానిపోతవి. అన్ని భావాలు మధురమౌతవి. అన్ని ప్రయాసలు విశ్రమిస్తవి. అన్ని పోరాటాలు సామరస్యం పొందుతవి. అన్ని చిక్కులు విడిపోతవి. భూతభవిష్యద్వర్తమాన సమగ్ర జీవిత సంపూర్ణ సత్యం అవగతమౌతుంది.
* మతం పుట్టింది అన్ని సంకుచితత్వాల నుండి మనిషి బయటపడెయ్యటానికి. సరిగా అర్థం చేసుకోనప్పుడు అదే ఒక ఇరుకు పంజరంలా మారుతుంది. ప్రపంచంలోని అన్ని మతాలు ఎలుగెత్తి చాటేది ఒకే ఒక సార్వత్రిక సత్యాన్ని. అయితే ఏమి? ప్రతి మనిషికో బలహీనత ఉంది. దాంతోవాడు అనంతమైన సముద్రానికి సరిహద్దు ఏర్పరుస్తాడు. వాటిని కాపాడేటందుకు మూర్ఖంగా జీవితమంతా వెచ్చిస్తాడు. అన్ని మతాల సారాంశం ఒక్కటే అని తెలిసినవారు మనుషులంతా ఒక్కటే అని నమ్ముతారు. పైపై ఆడంబరాలకు బానిసలైనవారు మనుషుల మధ్య అగాధం సృష్టించుతారు. మనిషి కోసం మతం కాని, మతం కోసం మనిషి కాదని మరిచిపోతారు. మీరు కట్టిన జైలుగోడల్ని మీరు పడగొట్టండి. అనంత జీవన మాధుర్యాన్ని రెండుచేతులూ జాచి జుర్రుకొనండి.
* ఒకప్పుడు చేతులు, దుడ్డుకర్రలు, తరువాత కత్తులు, విల్లంబులు, తుపాకులు, ఫిరంగులు, ఇప్పుడు బాంబులు ఆయుధాలుగా మారాయి. గాని మనుషుల్లో యుద్ధ ప్రవృత్తి మారలేదు. చంద్రుణ్ణి చేరుకున్నా, రేపు శుక్రుడు మీద జెండా ఎగరేసినా, ఇక్కడ భూమ్మీదవారు చేసేది, వాటిమీద ఆధిపత్యం కోసం తన్నుకోవటం. అంతరిక్షంలోకి ఎగురుతూ వెళ్ళినా అగాధజలధి అడుగుకి ఈదుతూ చేరినా, మనుషులు ఇంకా పాత స్వభావాలు మార్చిపోవటం లేదు. క్షమాగుణం అలవర్చుకోవటం లేదు. నిరంతరం పూరే మాధుర్యపు వూట ప్రతి హృదయంలోనూ ఉన్నది. అహంకారం అడ్డుకట్టవేసి మనిషి పరిపరివిధాల రగులుతున్నాడు.
* కదలకుండా కూర్చొని చేసే ఆలోచనలకీ, మాట్లాడే మాటలకీ, రాసే రాతలకీ ఖర్చు అయ్యే శక్తి ఎటువంటిదంటే, రైలింజను కూత వేసేప్పుడు విడుదల అయ్యే ఆవిరి వంటిది. కూతకు శబ్దం వస్తుంది. వినటానికి వింతగాను, బాగాను ఉంటుంది. కాని ఆ కూత ఇంజన్నూ కొంచెం కూడా కదల్చలేదు. అదే ఆవిరిని తిప్పి, తెలివిగావాడితే శక్తిగా మారి ఇంజన్నూ కదిల్చి గమ్యం జేరుస్తుంది. అందుకే మన ఋషులు చెప్పటం కంటే చేసి చూపటం మీదే శ్రద్ధపెట్టారు.
* సద్గురువు సమస్త విశ్వానికి కేంద్ర బిందువు. మార్పులేని శాశ్వతమైన ఆ బిందువు చుట్టూ సమస్త విశ్వం గిరగిర తిరుగుతోంది. విశ్వం తిరుగలి అయితే, గురువు మధ్య వున్న ఆధారపిడి వంటివాడు. పిడిని అంటిపెట్టుకుని వున్న గింజలు (సజ్జనులు) తప్ప ప్రపంచపు ద్వైదీభావాల తిరుగలి రాళ్ళ నడుమ నలుగకుండా తప్పించుకున్నవారు లేరు. ●

# చెన్నైలో ఆరంభమైన అంబికా రాజా చిత్రం




చిత్ర ప్రారంభోత్సవ దృశ్యంలో 3వ వ్యక్తి అంబికా రాజా

ఎప్పుడూ వ్యాపారమూ, సాహితీ సేవలతోనే 'బిజీ'గా ఉండే అంబికా రాజా తెలుగు చిత్ర నిర్మాణరంగంలోకి అడుగిడడం, తెలుగు సినిమా పుట్టిల్లయిన చెన్నయ్‌లో అల్లరి నరేష్‌తో చక్కని చిక్కని హాస్యచిత్రం ప్రారంభించడం ప్రముఖాంధ్ర అభినందిస్తుంది. అంబికా కుటుంబ సభ్యులందరూ ఈ చిత్రం ప్రారంభానికి హాజరు కావడం, సత్తిబాబు దర్శకత్వాన ప్రారంభమైన ఈ చిత్రం వారి అంబికా ఎంపైర్ హోటల్లో తొలిరోజు సన్నివేశం చిత్రీకరించడం జరిగింది.